Follow: @ANNTELUGU
15-03-2025
# మహా పత్రిక
ANN తెలుగు
శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 103 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ధైర్యమే నా ఆయుధం

**ఓడినా ముందుకెళ్ళి చరిత్ర తిరగరాశాం**

**మనం నిలబడ్డాం... టీడీపీని కూడా నిలబెట్టాం**


**జయకేతనం సభలో పవన్ కల్యాణ్ గర్జన**

**ఏపీ బ్యూరో, మహా:** భయం లేదు.. భయం లేదు.. ధైర్యమే నా ఆయుధం. ఓడినా ముందుకే అడుగేశాం, ఈ రోజు చరిత్ర తిరగరాశాం. మనం నిలబడ్డాం, నాలుగు దశాబ్దాల టిడిపిని నిలబెట్టాం. ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని నిలబెట్టాం అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. పిఠాపురంలోని చిత్రాడలో నిర్వహించిన జనసేన జయకేతనం సభలో పవన్ కల్యాణ్ గర్జించారు. నిర్బంధాలను చిత్తు చేసి.. అధికార పీఠం ఎక్కిన తీరును ప్రస్తావించారు. మిగతా 3లో

**జనసేనాని జయకేతనం** 04

**టాప్ న్యూస్**

### ప్రభుత్వ సలహాదారుగా జీవన్ రెడ్డి?



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యోచన
- సానుకూలంగా సీనియర్లు

03

### బ్రిటన్‌లో చిరంజీవికి అరుదైన గౌరవం



- బ్రిటన్ పార్లమెంట్లో జీవిత సాఫల్య పురస్కారంతో సత్కారం
- ఈ నెల 19న చిరుకు అవార్డును అందజేయనున్నట్లు ప్రకటన
- సినీ రంగంలో చిరంజీవి అందిస్తున్న సేవలకు గాను ఈ అవార్డు

02

### జగదీశ్ రెడ్డి.. మొగోనివైతే రాజీనామా చెయ్



- ఒక్క సెషన్ కాదు.. జగదీష్ రెడ్డి సభ్యత్వం పూర్తిగా రద్దు చేయాలి
- టీడీసీ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

02







## మాస్ కా బాస్

తెలంగాణ లీడర్లు మాస్ కా దాస్ లుగా మారిపోతున్నారు. సహచరులు, అనుచరులతో కలిసి చిందులేస్తూ మనల్ని ఎవడ్రా ఆపేది అంటూ జోష్ పంచుతున్నారు. డిజె టిల్లు పేరు డిజె స్టెప్పులకు మాస్ హీరోలను మించి.. పవర్ డ్యాన్స్ చేస్తున్నారు. డప్పులు కొడుతూ.. విజిల్స్ వేస్తూ దుమ్మురేపే స్టెప్పులేస్తున్నారు. బోయినపల్లిలో మాజీ మంత్రి మాస్ మల్లన్న మల్లారెడ్డి.. డ్యాన్స్ లతో రెచ్చిపోతే, సంగారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఫైర్ బ్రాండ్ ఓ రేంజిలో డ్యాన్స్ చేశాడు. మాస్ కటౌట్ లో సెలబ్రేషన్స్ లో రెచ్చిపోయాడు. కుర్రాలతో కలిసి చిందేశాడు. స్టేట్ వైడ్ గా ఇవి సంచలనమయ్యాయి. ఆదిలాబాద్ లో ఎస్పీ అఖిల్ మహాజన్, కలెక్టర్ రాజర్షి కూడా హోలీ ఆడుతూ డ్యాన్స్ లు అదరగొట్టాడు.

# సోనియా మార్క్



**తెలంగాణ కేబినెట్‌కు ఉద్యమముద్ర**

**2009-14 బ్యాచ్‌కు కీలకపదవులు**

**మంత్రివర్గ విస్తరణలో.. కొత్త ప్లాన్**

**కేసీఆర్ టార్గెట్ గా సరికొత్త వ్యూహాలు**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ పై కాంగ్రెస్ అగ్రనేత, రాష్ట్రాన్ని పట్టుబట్టి ఇచ్చిన సోనియాగాంధీ దృష్టి సారించిందా? తెంగాణ రాష్ట్ర సాధన కోసం లోక్ సభ సాక్షిగా పట్టుబట్టి.. రాష్ట్ర సాధన కల సాకారమయ్యేవరకు పనిచేసిన నేతలందరికి అవకాశాలు ఇవ్వాలని, తద్వారా తెలంగాణ ఇచ్చిన ముద్ర మరింత బలంగా వేయాలని సోనియాగాంధీ యోచిస్తున్నదా? తాజా రాజకీయ పరిణామాలు, ఢిల్లీ వర్గాల నుండి అందుతున్న సమాచారం దీనినే సూచిస్తున్నాయి. ఈ పంథాలోనే రాములమ్మను శాసనమండలి రంగంలోకి దింపారని, త్వరలో ఉద్యమబ్యాచ్ కు మరిన్ని ప్రాధాన్యపదవులు దక్కబోతున్నాయని తెలుస్తోంది. 200914 బ్యాచ్ ఎంపీలను సోనియాగాంధీ ప్రత్యేకంగా గౌరవించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. విజయశాంతికి ఎమ్మెల్సీ రాబోతున్నదని, కేబినెట్ లోకి విజయశాంతి అంటూ మొట్టమొదటిగా మహా పత్రిక లోనే కథనం ప్రచురితమైన విషయం విదితమే. 2009లో తెలంగాణ లో ఉన్న 17 ఎంపీలలో కాంగ్రెస్ కు 12 ఎంపీ స్థానాలుండగా, టీఆర్ఎస్ కు 2, టిడిపికి 2, ఎంఐఎం ఒకటి గెలిచాయి. తెలంగాణ కోసం లోక్ సభలో గట్టిగా కొట్లాడిన విజయశాంతి సోనియాగాంధీని నేరుగా కలిసి రాష్ట్రం కోసం రిక్వెస్ట్ చేశారు. తెలంగాణ ఇచ్చినందుకు కృతజ్ఞతగా టీఆర్ఎస్ వీడి కాంగ్రెస్ లో చేరారు. అప్పటి సంఘటనలు.. అన్నీ సోనియామదిలో ఉన్నాయి. ఇపుడు ఉద్యమాలతో ఇచ్చిన రాష్ట్రాన్ని.. ప్రగతిశీల రాష్ట్రంగా మలచాలని, నిలుపుకోవాలని కాంగ్రెస్ యోచిస్తోంది. మిగతా 2లో

## రాజా మంటపెడితే..

**సీఎంను కలుస్తున్నదెవరు?**

**బీజేపీలో రచ్చచర్చ**

**ఢిల్లీ నుండి హైకమాండ్ ఆరా**



**మహా :** రాష్ట్రంలో కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయ పార్టీగా ఎదిగేందుకు బీజేపీ వీరోచిత పోరాటం చేస్తోంది. ప్రదాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ రోజురోజుకూ ప్రజాధరణ కోల్పోతుండటంతో ఆ గ్యాప్ లోకి చొచ్చుకుపోవాలని కాషాయ పార్టీ ప్రయత్నిస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు నాయకత్వం ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తోంది. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినా తప్పనిసరిగా పోటీ చేయడంతో గెలుపే లక్ష్యంగా పని చేసేందుకు క్షేత్రస్థాయి నాయకులకు సలహాలు, సూచనలను కూడా ఇస్తోంది. మిగతా 2లో

## క్యాసినో, కోడిపందేల వ్యవహారం

**నాలుగున్నర గంటలు ఎమ్మెల్సీని విచారించిన పోలీసులు**

**నాకేం సంబంధం లేదని చెప్పా : శ్రీనివాస్ రెడ్డి**



**మహా :** కోడి పందేలు, క్యాసినో నిర్వహించిన వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని పోలీసులు విచారించారు. సుమారు నాలుగున్నర గంటల పాటు ఆయనను ప్రశ్నించారు. మిగతా 3లో



**విడుదలైన గ్రూప్ 3**

## ఫలితాలు

**1,365 సర్వీసుల పోస్టుల భర్తీ**

**పరీక్షకు 2,69,483 మంది హాజరు**

02



## సిఫార్సు లేఖలపై టీటీడీ వివక్ష

**మండిపడ్డ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు**


**తిరుమల వచ్చి తేల్చుకుంటామని అల్టిమేటం**

**మహా :** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారుల తీరుపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సీరియస్ అయ్యారు. తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధులు ఇచ్చిన లేఖలను పరిగణలోకి తీసుకోకపోవటంపై మండిపడ్డారు. తెలంగాణ నేతల లేఖలకూ ప్రాధాన్యత మిగతా 2లో

**మత్తిచ్చి... మానవ మృగాల బోనులోకి..**

## ఓరుగల్లులో వలపువల

**పోలీసులకు చిక్కిన క్రిమినల్ లేడీ?**



**వరంగల్, మహా:** వరంగల్ లో ఒళ్ళు గగుర్పొడిచే సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. కాలేజీ గేటు ముందు నిలబడి మచ్చిక చేసుకుని వలపు వల విసిరి మానవ మృగాల బోనులోకి యువతులను పంపుతున్న ముఠా ఆచూకీ పోలీసులకు చిక్కింది. మిగతా 3లో

## బ్యాంక్ ఉద్యోగుల సమ్మె సైరన్

**రెండు రోజులు బ్యాంకులు బంద్**

**24, 25 తేదీలలో సమ్మెకు దిగనున్న బ్యాంక్ ఉద్యోగులు**

వివరాలు 2లో

**హోళీ ఈవెంట్ పేరుతో**

## భారీ చీటింగ్

**మోసపోయామని లబో దిబో మన్న కస్టమర్లు**

**సెలబ్రిటీల పేరుతో భారీగా వసూళ్ళు**

02

# సిఫార్సు లేఖలపై టీటీడీ వివక్ష

## మండిపడ్డ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు

### తిరుమల వచ్చి తేల్చుకుంటామని అల్టిమేటం



(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వాలని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సూచించినా, టీటీడీ పాలక మండలి నిర్ణయించినా ఎందుకు పరిగణ లోకి తీసుకోవటం లేదని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై టీటీడీ బోర్డు ఖచ్చితమైన దృష్టి పెట్టలన్నారు. పరిస్థితిలో మార్పు రాకుంటే తమ కార్యాచరణ ఏంటో కూడా తేల్చి చెప్పారు.

తిరుమలలో తెలంగాణ ప్రజా ప్రతినిధుల లేఖలను పట్టించుకోవటం లేదని ఆ రాష్ట్ర నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వ వినతి మేరకు ఆ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల లేఖ లను పరిగణలోకి తీసుకోవాలని ఏపీ ముఖ్యమంత్రి టీటీడీకి సూచించారు. ఈ మేరకు నిబంధనలు సైతం ఖరారు చేసారు. ఫిబ్రవరి 1 నుంచి తెలంగాణ ప్రజా ప్రతినిధుల లేఖలు అమలు అయ్యేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో, తెలంగాణ నుంచి వచ్చే భక్తులకు తిరుమలలో దర్శనం వసతి కోసం ప్రజా ప్రతినిధులు లేఖలు ఇస్తున్నారు. తాము ఇచ్చిన లేఖలను టీటీడీ ఉద్యోగులు బేఖాతర్ చేస్తుండటంతో తెలంగాణ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే క్రమంలో తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి సురేఖ తాజాగా ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ కూడా రాసారు. ఏపీ ముఖ్యమంత్రి ఆదేశించిన విధంగా అమలు చేస్తే తెలంగాణ ప్రజాప్రతినిధులకు రోజుకు 1100 టికెట్లు అదనంగా పెరుగుతాయని టీటీడీ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే రోజుకు 7500 దర్శనాలు వీఐపీలకు ఇస్తున్నారు. ఇక ప్రజాప్రతినిధుల లేఖలకు 2 వేల వీఐపీబ్రేక్ దర్శనాలు ఇస్తున్నారు. ప్రస్తుతం రోజూ 75 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుంటున్నారు. కాబట్టి సహజంగా టీటీడీపై ఒత్తిడి అధికంగా ఉంటుందనే వాదన వినిపిస్తున్నారు. అయితే, తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పరిగణలోకి తీసుకొనేలా తొలుత నిర్ణయం జరిగినా అమలు మాత్రం జరగటం లేదంటూ తెలంగాణ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఇదే అంశం పైన కీలక వ్యాఖ్యలు చేసారు. తెలంగాణ ప్రజాపతినిధుల లెటర్లకు వెంటనే దర్శనాలు, రూమ్ లు ఇవ్వాలని డిమాండ్ చేసారు. తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారస్సు లేఖల పట్ల వివక్ష బాధాకరమన్నారు. ఫిబ్రవరి ఒకటవ తేదీ నుండి తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని గుర్తు చేసారు. ఉమ్మడి ఏపీలో 294 మంది ఎమ్మెల్యేలకు బ్రేక్ దర్శనాలు, అకామిడేషన్ ఇచ్చేవాళ్ళని చెప్పుకొచ్చారు. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రజాప్రతినిధుల లేఖలు మాత్రమే అనుమతించడం బాధా కరమని పేర్కొన్నారు. లెటర్లు ఇవ్వమని వారే చెప్పారు, అకామిడేషన్ ఇవ్వలేమని కూడా వాళ్ళే చెబుతున్నారుని వ్యాఖ్యానించారు. వివక్ష పట్ల టిటిడి బోర్డు వెంటనే ఆలోచన చేయాలని కోరారు. పార్టీలకు అతీతంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. లెటర్లు పంపిస్తామని చెప్పిన ఎంపీ రఘునందన్ అనుమతించకపోతే అందరు ఎమ్మెల్యేలు వస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఇక, ఇప్పుడు టీటీడీ ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది చూడాల్సి ఉంది.

# సోనియా మార్క్

## తెలంగాణ కేబినెట్‌కు ఉద్యమముద్ర



(మొదటిపేజీ తరువాయి)

ఈ క్రమంలో సోనియాగాంధీ తెలంగాణపై దృష్టి సారించారన్న సమాచారం నేతల్లో ఉత్సాహం నింపుతోంది.

**విస్తరణపై ముద్ర**

నెలాఖరులో తెలంగాణ మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశముందన్న చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే పలు సర్వే నివేదికలు హైకమాండ్ కు చేరాయి. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ కూడా.. రాష్ట్ర పరిస్థితులపై పూర్తి అవగాహన తెచ్చుకుంటూ పలు సర్వే నివేదికలు పరిశీలిస్తున్నారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మూడు ఎమ్మెల్సీలపై క్యాడర్ లో పాజిటివ్ టాక్ ఉంది. దీంతో త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలోనూ ఈ తరహా ముద్రనే వేయాలని, పైరవీలకు తావు లేకుండా భవిష్యత్తును పరిగణనలోకి తీసుకుని పదవుల పందారం చేయాలన్నయోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. 2009లో ఎంపీలుగా పనిచేసిన వారిలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ తిరిగి ప్రస్తుతం కూడా ఎంపీలుగా ఉన్నారు. సికింద్రాబాద్ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ కుమారుడు అనిల్ కుమార్ యాదవ్ ఎంపీ రాజ్యసభగా ఉన్నారు. దిగ్గజ నేత సూదిని జైపాల్ రెడ్డి కుటుంబసభ్యులు, అల్లుడు రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు. మంద జగన్నాథం ఇటీవల కాలంలో కాలం చేశారు. పొన్నం ప్రభాకర్ రాష్ట్ర మంత్రివర్గంలో ఉన్నారు. సిరిసిల్ల రాజయ్య రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ గా ఉన్నారు. సర్వే సత్యనారాయణకు సోనియాగాంధీ కేంద్రమంత్రిగా కూడా అవకాశమిచ్చింది. తర్వాత పరిణామాల్లో ఆయన దానిని నిలుపుకోలేదన్న ఆగ్రహంతో హైకమాండ్ ఉంది. విజయశాంతి టీఆర్ఎస్ ఎంపీగా ఉన్నా 2014 ఎన్నికలకు ముందే కాంగ్రెస్ లో చేరి పార్టీ ఆదేశం మేరకు మెదక్ ఎమ్మెల్యేగా పోటీచేసింది. గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రస్తుతం కౌన్సిల్ ఛైర్మన్ గా ఉన్నారు. నాడు ఎంపీగా పోటీచేసి.. ప్రస్తుతం రాష్ట్రంలో యాక్టివ్ గా ఉన్న నేతల్లో పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జి.వివేక్, విజయశాంతి, మధుయాష్కీ, అంజన్ కుమార్ యాదవ్ ఉన్నారు. వీరిలో పొన్నం ఇప్పటికే మంత్రి ఉండగా, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జీ.వివేక్ మంత్రిపదవి బలంగా కోరుకుంటున్నారు. విజయశాంతికి ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడంతో మంత్రిగా చేసే అవకాశం ఉందన్న చర్చ కూడా ఉంది. మధుయాష్కీ గౌడ్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా లేని నేపథ్యంలో అధిష్టానం ఏ అవకాశం ఇస్తుందో చూడాలి.

### ప్రత్యేక వ్యూహం

నాటి రోజులు, సంఘటనలు.. కాంగ్రెస్ చేసిన త్యాగాలు గుర్తుచేసేలా సరికొత్త ప్రణాళికలు కాంగ్రెస్ హైకమాండ్ సిద్దం చేస్తోంది. తల్లితెలంగాణ పార్టీ ఆవిర్భావం, విలీనం కోసం కేసీఆర్ చేసిన ఒత్తిడిని తొలిరోజే విజయశాంతి కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం వెనుక పెద్ద ప్రణాళిక ఉన్నట్లు స్పష్టమవుతోంది. కేసీఆర్ లక్ష్యంగా ఆ నాడు హామీలిచ్చి ఉల్లంఘించిన అంశాలను తెలంగాణ ప్రజల ముందుంచాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణను జారవిడుచుకోవొద్దని, తెలంగాణ ఛాంపియన్ ఎప్పటికీ కాంగ్రెస్ పార్టీనే అన్న విషయాన్ని మరింత బలంగా ప్రజల మనసుల్లో నాటాలన్నసంకల్పం సోనియా భావనగా ఉన్నట్లు సమాచారం.

# బ్యాంక్ ఉద్యోగుల సమ్మె సైరన్

## రెండు రోజులు బ్యాంకులు బంద్

### 24, 25 తేదీలలో సమ్మెకు దిగనున్న బ్యాంక్ ఉద్యోగులు

**మహా :** డిమాండ్ల సాధనలో భాగంగా బ్యాంకు ఉద్యోగులు మార్చి 24, 25 తేదీల్లో సమ్మెకు దిగనున్నారు. ఈ రెండు రోజుల పాటు దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నట్లు బ్యాంక్ యూనియన్ల ఐక్య వేదిక యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్‌యూఎఫ్‌బీయూ తెలిపింది. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ ఐబీఏతో జరిగిన చర్చలు ఎటువంటి సానుకూల ఫలితాన్ని ఇవ్వకపోవడం వల్ల యూఎఫ్‌బీయూ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఐబీఏతో జరిగిన సమావేశంలో అన్ని యూఎఫ్‌బీయూ సభ్య సంఘాలు అన్ని కేడర్లలో నియామకాలు, ఐదు రోజుల పనివారం వంటి సమస్యలను లేవనెత్తాయి. అయినప్పటికీ కీలక సమస్యలు పరిష్కారం కాలేదని నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్‌ఎన్ సీబీఈ ప్రధాన కార్యదర్శి ఎన్ చంద్రశేఖర్ తెలిపారు.



తొమ్మిది బ్యాంకు ఉద్యోగుల సంఘాలతో కూడిన యూఎఫ్‌బీయూ ప్రభుత్వ రంగ బ్యాంకులలో వర్క్‌మెన్, ఆఫీసర్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయడం వంటి డిమాండ్ల కోసం ఒత్తిడి తీసుకురావడానికి ఇంతకుముందు సమ్మెను ప్రకటించింది. పని తీరు సమీక్షలు, పని తీరుసంబంధిత ప్రోత్సాహకాలకు సంబంధించి ఆర్థిక సేవల విభాగం డీఎఫ్‌ఎస్ ఇటీవల జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని కూడా యూనియన్లు కోరాయి. డీఎఫ్ఎస్ ఆదేశాలు ఉద్యోగ భద్రతకు ముప్పు కలిస్తాయని ఆందోళన వ్యక్తం చేశాయి. ఆంతేకాకుండా ప్రభుత్వ బ్యాంకుల్లో డీఎఫ్ఎస్ "మైక్రో మేనేజ్‌మెంట్" అనేది సబబు కాదని వాదించాయి. ఇలాంటి జోక్యాలు బ్యాంకు బోర్డుల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తాయని చెప్పాయి. ఇవే కాకుండా సీలింగ్‌ను రూ.25 లక్షలకు పెంచేలా గ్రాట్యుటీ చట్టాన్ని సవరించాలని, ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు వంటి డిమాండ్లను కూడా ఉద్యోగ సంఘాలు ఐబీఏ ముందు ఉంచాయి. యూఎఫ్‌బీయూలో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ), ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ (ఏఐబీఓసీ), నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ (ఎన్ సీబీఈ), ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏఐబీఓఏ) వంటి ప్రధాన బ్యాంకు ఉద్యోగుల సంఘాలు ఉన్నాయి



# విడుదలైన గ్రూప్ 3 ఫలితాలు

## 1,365 సర్వీసుల పోస్టుల భర్తీ

### పరీక్షకు 2,69,483 మంది హాజరు

**మహా :** గ్రూప్3 ఫలితాలు విడుదల అయ్యాయి. రాష్ట్రంలో 1,365 గ్రూప్3 సర్వీసుల పోస్టుల భర్తీకి నిర్వహించిన రాత పరీక్షల ఫలితాలను టీజీపీఎస్సీ శుక్రవారం విడుదల చేసింది. జనరల్ ర్యాంకుల జాబితాను కమిషన్ ప్రకటించింది. అలాగే, గ్రూప్3 పరీక్ష తుది కీ, మాస్టర్ క్వశ్చన్ పేపర్లతో పాటు ఓఎంఆర్ షీట్లను డౌన్‌లోడ్ కోసం టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. గ్రూప్3లో పురుష టాప్ ర్యాంకర్‌కు 339.24 మార్కులు, మహిళా టాప్ ర్యాంకర్‌కు 325.15 మార్కులు వచ్చాయి. గ్రూప్3లో మొదటి 36 ర్యాంకుల్లో ఒకే ఒక మహిళా అభ్యర్థి ఉన్నారు. గత సంవత్సరం నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించిన గ్రూప్3 పోస్టులకు 5.36 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 50.24 శాతం మంది మాత్రమే పరీక్షలకు హాజరు అయ్యారు. షెడ్యూలు ప్రకారం ఈ నెల 10, 11 తేదీల్లో గ్రూప్1, గ్రూప్2 రాత పరీక్షల మార్కులను టీజీపీఎస్సీ వెల్లడించిన విషయం తెలిసిందే. అలాగే, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షల తుది ఫలితాలను ఈ నెల 17న, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగ పరీక్షల తుది ఫలితాలను ఈ నెల 19న ప్రకటించనున్నారు.

# బ్రిటన్‌లో చిరంజీవికి అరుదైన గౌరవం



**మహా:** టాలీవుడ్ అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవికి తాజాగా మరో అరుదైన గౌరవం దక్కింది. బ్రిటన్ ప్రభుత్వం ఆయనకు జీవిత సాఫల్య పురస్కారం ప్రకటించింది. నాలుగు దశాబ్దాలకు పైగా సినీ రంగానికి, సమాజానికి చేసిన సేవలకుగానూ చిరంజీవి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందించనున్నట్లు తెలిపింది. మార్చి 19న యూకే పార్లమెంటు (హౌస్ ఆఫ్ కామన్స్)లో ఈ అవార్డును చిరుకు అందజేయనున్నట్లు పేర్కొంది. యూకేకి చెందిన అధికార లేబర్ పార్టీ పార్లమెంట్ మెంబర్ నవేందు మిశ్రా చిరంజీవిని మార్చి 19న సన్మానించనున్నారు. సోజన్ జోసెఫ్, బాబ్ బ్లాక్ మన్ సహా ఇతర పార్లమెంట్ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అదే వేదికపై బ్రిడ్జ్ ఇండియా సంస్థ... సినిమా, ప్రజాసేవ, దాతృత్వానికి చిరంజీవి చేసిన కృషిని గుర్తించి కల్చరల్ లీడర్షిప్ ద్వారా ప్రజాసేవలో ఎక్సలెన్స్ కోసం 'జీవిత సాఫల్య పురస్కారం' ప్రదానం చేయనున్నారు.

ఇక బ్రిడ్జ్ ఇండియా అనేది యూకేలో ఒక ప్రముఖ సంస్థ. ఇది పబ్లిక్ పాలసీని రూపొందించడానికి పనిచేస్తుంది. అలాగే వివిధ రంగాల్లోని వ్యక్తులు సాధించిన విజయాలు, వారు తమ చుట్టూ ఉన్న సమాజంపై చూపించిన ప్రభావం మరింత విస్తృతం కావాలనే ఉద్దేశంతో వారిని సత్కరిస్తుంది. కాగా, బ్రిడ్జ్ ఇండియా సంస్థ జీవిత సాఫల్య పురస్కారాన్ని తొలిసారిగా అందజేస్తోంది. దాన్ని చిరంజీవి అందుకోనుండటం విశేషం. ఇది ఆయన కీర్తి కీరటంలో మరో కలికితురాయిగా నిలుస్తుంది.

బ్రిటన్‌కు చెందిన పార్లమెంట్ సభ్యులు, బ్రిడ్జ్ ఇండియా వంటి ప్రఖ్యాత సంస్థ అంతర్జాతీయ వేదికపై చిరంజీని సన్మానించటం, ఆయనకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ ఇవ్వడం అనేది ప్రత్యేకమైన సందర్భం. 2024లో భారత ప్రభుత్వం నుంచి రెండో అత్యున్నత పౌర పురస్కారం పద్మ విభూషణ్ ను చిరంజీవి అందుకున్నారు. అలాగే గతేడాది అత్యంత సమర్ధవంతమైన నటుడు, డ్యాన్సర్ గా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లో కూడా చోటు సంపాదించారు. ఏ.ఎన్.ఆర్ శత జయంతి సందర్భంగా అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్ 2024లో చిరంజీవికి ప్రతిష్టాత్మక ఏ.ఎన్.ఆర్ జాతీయ అవార్డును సైతం ప్రధానం చేసింది.



## ప్రభుత్వ సలహాదారుగా

# జీవన్ రెడ్డి?

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పదవీవిరమణ చేయబోతున్న జీవన్ రెడ్డిని నియమించే అవకాశాలున్నాయి. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఆశించినా ఇప్పటికే ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీకి హైకమాండ్ అవకాశాలు ఇచ్చిన నేపథ్యంలో ఏడాదిన్నరలోనే మూడు అవకాశాలు ఇవ్వకూడదని భావించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జగిత్యాలలో ఉన్న ప్రత్యేక పరిస్థితులు, జీవన్ రెడ్డి సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న నేపథ్యంలో జీవన్ రెడ్డి లాంటి నేత సేవలను ఏదో ఒక రకంగా వినియోగించుకునే యోచనలో పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. సీనియర్లు కూడా జీవన్ రెడ్డి పట్ల సానుకూలంగా ఉన్నారు.

## జగదీశ్ రెడ్డి.. మొగోనివైతే

# రాజీనామా చెయ్

### ఒక్క సెషన్ కాదు.. జగదీష్ రెడ్డి సభ్యత్వం పూర్తిగా రద్దు చేయాలి

### టీడీసీ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** జగదీష్ రెడ్డి ని ఈ ఒక్క సెషన్ కాదని, జగదీష్ రెడ్డి సభ్యత్వం పూర్తిగా రద్దు చేయాలని తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. ఇప్పటికీ జగదీష్ రెడ్డి బలుపు తగ్గలేదంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం గాంధీభవన్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులను అవమానించే చరిత్ర కేసీఆర్ కు, బీఆర్ఎస్ కు ఉందన్నారు. అధికారం పోయి, వేల కోట్లు సంపాదించుకోలేక పోతున్నానని జగదీష్‌రెడ్డి ఏడుస్తున్నాడన్నారు. జగదీష్ రెడ్డి అదృష్టంతో గెలుస్తున్నాడు తప్ప.. ఎప్పుడు 30శాతం ఓట్లు రాలేదని మండిపడ్డారు. వేల కోట్ల ఆస్తులు సంపాదించారని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామని, జగదీష్‌రెడ్డికి దమ్ముంటే.. రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశారు. ఎవరు చేసింది కరెక్ట్ అనేది ఎన్నికల్లో ప్రజలు నిర్ణయిస్తారని, నువ్ నాయకునివైతే, మొగోనివైతే రాజీనామా చెయ్ అంటూ పటేల్ రమేష్ రెడ్డి సవాల్ చేశారు.



# హోళీ ఈవెంట్ పేరుతో భారీ చీటింగ్

## మోసపోయామని లబోదిబోమన్న కస్టమర్లు

### సెలబ్రిటీల పేరుతో భారీగా వసూళ్ళు

**మహా :** హోళీ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నాపెద్దా అంతా కలిసి రంగులద్దుకుని సందడి చేశారు. దీంతో సిటీ రోడ్లు అన్నీ రంగులమయం అయ్యాయి. అయితే ఈ సందర్భంగా నగరంలో పెద్ద ఎత్తున స్పెషల్ ఈవెంట్స్ కూడా జరిగాయి. హోటల్స్, పబ్, రిసార్టుల్లో ఎవరికి వారుగా పార్టీలు నిర్వహించారు. హోళీ వేడులను ఘనంగా నిర్వహిస్తామని. ఈ వేడుకలకు సినీ సెలబ్రిటీలు రానున్నారంటూ ఓ ఈవెంట్ నిర్వాహకులు హంగామా చేశారు. కస్టమర్లను ఆకర్షించేలా హోర్డింగ్ ఏర్పాటు చేసి టికెట్లు విక్రయించారు. భారీగా డబ్బులు వసూలు చేసి చేతులెత్తయడంతో జనాలంతా లబోదిబోమంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన హైదరాబాద్ మాదాపూర్ లో జరగగా వివరాలు ఇలా ఉన్నాయి.

**హోళీ నేషన్ పేరిట ఈవెంట్**

మాదాపూర్‌లోని 'మ్యాన్ మేడ్ హిల్స్'లో హోళీ నేషన్ పేరిట ఈవెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రచారం చేశారు. హీరోయిన్ కాజల్ వస్తుందంటూ భారీ ధరకు టికెట్లు విక్రయించారు. దీంతో జనం ఎగబడి టికెట్లు కొన్నారు. కానీ చివరకు ఊహించని షాక్ తగిలింది. కాజల్ కాదు కదా కనీసం యూట్యూబ్ స్టార్ కత్తర్ పాప కూడా రాలేదు. ఈవెంట్ కు వచ్చిన వారంతా ఆందోళనకు దిగారు. ఆర్గనైజర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ టికెట్ డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఈవెంట్ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్లాన్ చేయగా పోలీసులు మధ్యాహ్నం 1 వరకే పర్మిషన్ ఇచ్చారు. అంతేకాదు స్వయంగా ఈవెంట్ జరుగుతుంటే అక్కడికి వచ్చి జనాలను బయటకు పంపించారు. దీంతో వేలకు వేలు పెట్టి టికెట్లు కొని మోసపోయామని లబోదిబోమంటున్న జనం డీజేలు కూడా సరిగ్గా పనిచేయలేదని అందరినీ నట్టేటా ముంచేశారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఇష్యూ హైదరాబాద్ నగరంలో చర్చనీయాంశమైంది.



# రాజా మంటపెడితే..

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ , అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్ళడంతో పాటు రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హామీల అమలు వైఫల్యాలను ఎలుగెత్తి చాటేందుకు పార్టీ కార్యాచరణలో నిమగ్నమైంది. ఇవన్నీ ఒక ఎత్తైతే గోషామహల్ ఎమ్మెల్యే ఖట్టర్ హిందూత్వవాది రాజాసింగ్ వ్యవహారం రోజురోజుకూ శృతి మించుతుండటంతో కాషాయ దళంలో కలకలం మొదలైంది. గత కొంత కాలంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్న రాజాసింగ్ అఇప్పుడప్పుడు పార్టీ నాయకత్వంపై తిరుగుబాటు వ్యాఖ్యలు చేయడం సహజమైంది. అయితే ఇటీవల కాలంలో ఆయన వ్యాఖ్యలు పార్టీని ఇరుకున పెట్టేవిగా ఉండటంతో అధిష్టానం అప్రమత్తమైంది. పార్టీకి కొరకరాని కొయ్యలా తయారవడంతో ఆయనను ఎలా దారికి తీసుకు రావాలన్న అంశంపై పార్టీలో చర్చ మొదలైనట్లు తెలుస్తోంది. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందంటూనే పాత సామాన్లుగా ఉన్న కొంత మంది నేతలను పక్కకు తప్పించాలని, నాయకత్వం బాధ్యతలను కొత్త వారికి అప్పగించాలని వ్యాఖ్యానించడం సంచలనంగా మరింది. వాస్తవానికి గత కొన్నాళ్ళుగా ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి రాజాసింగ్ కు మధ్య విబేధాలు బయటపడ్డాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ ఉన్నంత కాలం రాజాసింగ్ బీజేపీకి విదేయుడిగానే వ్యవహరించారు. తిరిగి కిషన్ రెడ్డి



పార్టీ పగ్గాలు అప్పగించినప్పటి నుంచి దూరంగా ఉంటున్నారు. తాజాగా రాజాసింగ్ పార్టీలో కోవర్టున్నారని, వారు తమ పనుల కోసం రహస్యంగా సీఎంను కలుస్తున్నారంటూ బాంబు పేల్చారు. అంతేకాకుండా సరైన సమయంలో ఆధఘూరాలన్నింటినీ అధిష్టానంకు ఇస్తానని చెప్పడం తీవ్ర చర్చ నీయాంశంగా మారింది. బీజేపీ బీఆర్ఎస్ ఒక్కటేనని కాంగ్రెస్ అంటుంటే, బీజేపీ కాంగ్రెస్ ఒక్కటేనని బీఆర్ఎస్ పదే పదే అంటోంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డితో బీజేపీ నేతలు కొంత మంది రహస్యంగా భేటీ అవుతున్నారని, రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు పార్టీని తీవ్ర ఇబ్బందులకు గురి చేసేలా ఉందన్న చర్చ కూడా మొదలైంది. సీఎంను రహస్యంగా కలుస్తున్ నపార్టీ నేతలు ఎవరన్న అంశంపై చర్చ జోరందుకుంది. అంతే కాకుండా పార్టీలో ఉన్న స్రాకప్ ఎవరు, స్రాకప్ ద్వారా పార్టీకి ఏ రకంగా నష్టం జరుగుతుందన్న చర్చ మొదలైంది. మొత్తంగా ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలనుకుంటున్న బీజేపీకి రాజాసింగ్ వ్యాఖ్యలు పార్టీని సంకటంలోకి నెట్టేశాయి.

### మత్తిచ్చి... మానవ మృగాల బోనులోకి..

# ఓరుగల్లులో వలపువల

## పోలీసులకు చిక్కిన క్రిమినల్ లేడీ?

(మొదటిపేజీ తరువాయి)

స్కూల్ గేటు దగ్గరో.. కాలనీ ఎంట్రెన్స్ దగ్గరో ఓ మహిళ నిలబడి ఉంటుంది.. పాఠశాల ముగిసిన వెంటనే బయటకొచ్చే ఆడపిల్లలతో 'నువ్వు చాలా అందంగా ఉన్నావ్?... నీ పేరేంటీ? అంటూ మాటలు కలిపి, ఆ తర్వాత రోజు కూల్ డ్రింక్ తాగుదామా?.. అంటూ ఆఫర్ చేస్తుంది. డ్రగ్స్ కలిపిన డ్రింక్ ఇచ్చి కిడ్నాప్ చేస్తుంది. నేరుగా తీసుకెళ్లి తమకు డబ్బులిచ్చి అప్పటికే వేచి చూస్తున్న మానవ మృగాలకు అప్పగిస్తుంది. వాళ్లు లైంగికంగా దాడికి పాల్పడిన తర్వాత మత్తులోంచి తేరుకునేలోపు తీసుకొచ్చి తెచ్చినచోటే వదిలి వెళ్తుంది. ఇలా ఎంతోమంది యువతులతో ఓ ముఠా దుర్మార్గాలకు తెరతీసినట్లు తెలుస్తోంది. సంపన్నుల కాలనీలు, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులే లక్ష్యంగా ఈ దందా చేస్తున్న ఈ గ్యాంగ్ పలువురు బాలికల జీవితాలు నాశనం చేసినట్లు తెలుస్తోంది. వరంగల్ మిల్స్ కాల నీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక క నిపించ కుండా పోగా కుటుంబ సభ్యులు పోలీసు లకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ఇంటికి చేరుకున్న బాలికను ఆరా తీయగా తనను ఓ మహిళ కిడ్నాప్ చేసి తీసుకెళ్లిందని, ఆ తర్వాత తనకేం జరిగిందో తెలియదని, స్పృహలోకి వచ్చాక వదిలేసి వెళ్లారని చెప్పింది.



బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించగా ఆమెకు డ్రగ్స్ ఇచ్చినట్టుగా తేలినట్లు సమాచారం. ఆ బాలిక చెప్పిన వివరాలు, ఆనవాళ్లు ఆధారంగా దర్యాప్తు చేపట్టగా సదరు కిలాడీ లేడీ గ్యాంగ్ చేస్తున్న దారుణాలు వెలుగులోకి వచ్చాయి. ఈ లేడీ క్రిమినల్ తోపాటు ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. విచారణలో సంచలన విషయాలు బయటకు వచ్చే అవకాశాలున్నాయి.

# ధైర్యమే నా ఆయుధం

(మొదటిపేజీ తరువాయి)

అన్యాయాన్ని, అక్రమాలపై తన పోరాటం ఎప్పటికీ ఆగదని ఉద్ఘాటించారు.

**అసెంబ్లీ గేటు తాకలేవు అన్నారు.. బద్దలుకొట్టాం**

ఇల్లేమో దూరం.. చేతిలో దీపం లేదు.. గుండె ధైర్యమే కవచంగా ధరించిన వాడిని కనుకే.. అన్నీ ఒక్కడినే ఐ.. 2014 లో జనసేన పార్టీ స్థాపించాను. భావ తీవ్రత ఉంది కాబట్టే 2018 లో పోరాట యాత్ర చేశాం. ఓటమి భయం లేదు కాబట్టే 2019 లో పోటీ చేశాం. ఓడినా అడుగు ముందుకే వేశాను. మనం నిలబడ్డాం. పార్టీని నిలబెట్టాం. మనం నిలదొక్కుకోవడమే కాకుండా.. నాలుగు దశాబ్దాల టీడీపీని కూడా నిలబెట్టాం. మనం 2019లో ఓడినప్పుడు మీసాలు మేలేశారు, జబ్బలు జరిచారు, తొడలు కొట్టారు. మన ఆడపడుచులను అవమానించారు. ప్రజలను హింసించారు. ఇదేమి న్యాయం అని మన జనసైనికులు, వీర మహిళలు గొంతెత్తితో వారిపై కేసులు పెట్టి జైళ్లల్లో పెట్టారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడిని అక్రమంగా జైలులో బంధించారు. వారి పార్టీ సీనియర్ నాయకులను రోడ్డు మీద రావాలంటే భయపడేలా చేశారు. ఇక నాలాంటి వాడిపై చేయని కుట్ర లేదు, తిట్టని తిట్టు లేదు, వేయని నిందలు లేవు. ఈ ఎన్నికలో అసెంబ్లీ గేటు కూడా తాకలేవు అని ఛాలెంజ్ చేసి తొడలు గొట్టినవారికి బుద్ధి వచ్చేలా ఆ గేట్లను బద్దలు కొట్టాం. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 21 మంది ఎమ్మెల్యేలు, పార్లమెంట్ లో ఇద్దరు ఎంపీలతో అడుగు పెట్టాం. దేశమంతా తల తిప్పి తిరిగి చూసేలా వంద శాతం స్ట్రైక్ రేట్ తో ఘన విజయం సాధించాం. ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని నిలబెట్టాం. ఈరోజు జయకేతనం ఎగురవేస్తున్నాం.

**తెలంగాణలోనే జన్మస్థలం**

తెలంగాణపై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన జన్మ స్థలం తెలంగాణ అయ్యింది.. కర్మ స్థలం ఆంధ్రప్రదేశ్ అయ్యింది. కృష్ణమాచార్య మాటలు.. మాకే కాదు.. మన ప్రజలకు ఊతమిచ్చాయి. నా గుండె లోతుల్లో నుంచి మీ అందరికీ ధన్యవాదాలు. మూగబోయిన కోటి మంది తమ్ముళ్ల గళాన్ని వినిపించిన నా తెలంగాణా కోటి రతనాల వీణ. అలాంటి కోటి ధివిటీల కాంతి జ్యోతి తెలంగాణా. ఆనాడు కరెంటు షాక్ తగిలి ప్రాణాపాయ స్థితిలో ఉన్న నాకు చనిపోబోయిన నాకు కొండగట్టు ఆంజనేయుడి ఆశీస్సులు.. నన్ను ప్రేమించే ప్రజల దీవెన నాకు ఊపిరి ఇచ్చింది. అలాంటి తెలంగాణ బిడ్డలందరికీ నా హృదయపూర్వక వందనాలు. బండెనక గట్టి.. పదహారు బండ్లు కట్టి.. అంటూ కాళ్లకు గజ్జె కట్టి.. చేతికి కర్ర పెట్టి.. ఆటని, పాటని



ఆయుధంగా మలిచిన వాడు.. యువతలో స్ఫూర్తిని నింపినవాడు. నేను కనిపిస్తే ఎలా ఉన్నావు తమ్ముడు అని ఆప్యాయంగా పలకరించే.. మన దగ్గర లేని నా గద్దరన్న. మా ఆడపడుచులు, వీర మహిళల స్ఫూర్తి, పోరాటాన్ని నేను మరువను. మీరంతా రాణి రుద్రమలు.. జనసేన వీరమహిళలు.. అందరి క్షేమం కాంక్షించే సూర్య కిరణాల లేలేత కిరణాలు. తేడా వస్తే కాల్చి ఖతం చేసే లేజర్ భీమ్‌లు.. మా జనసేన వీర మహిళలు అంటూ తన ప్రసంగంతో పార్టీ శ్రేణుల్లో పవన్ కల్యాణ్ సరికొత్త జోష్ నింపారు. సభలో ఎమ్మెల్సీ నాగబాబు, నాదెండ్ల మనోహర్, బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రసంగాలు ఆకట్టుకున్నాయి.

# క్యాసినో, కోడిపందేల వ్యవహారం

### నాలుగున్నర గంటలు ఎమ్మెల్సీని విచారించిన పోలీసులు

### నాకేం సంబంధం లేదని చెప్పా : శ్రీనివాస్ రెడ్డి



(మొదటిపేజీ తరువాయి)

ఆయనతో పాటు న్యాయవాది, ఫామ్‌హౌస్ లీజుకు తీసుకున్న వ్యక్తి వచ్చినా పోలీసులు లోపలికి అనుమతించలేదు. మొయినాబాద్ పోలీసులు నోటీసు ఇవ్వడంతో విచారణకు హాజరైనట్టు తెలిపిన పోచంపల్లి.. అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చినట్టు వివరించారు. ఇది రాజకీయ ప్రేరేపితమైన కేసు అని, ఫామ్‌హౌస్ లీజు వివరాలు అడిగితే చెప్పానని తెలిపారు. గత నెల 11న మొయినాబాద్ తొల్కట్ట గ్రామంలోని పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో క్యాసినో, కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు సోదాలు చేశారు. 61 మందిపై కేసు నమోదు చేశారు. ఫామ్‌హౌస్ యజమాని పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి విచారణకు హాజరు కావాలని ఫిబ్రవరి 13న నోటీసులు ఇచ్చారు. న్యాయవాదిని పంపి సమాధానం ఇచ్చిన శ్రీనివాస్‌రెడ్డి.. ఫామ్‌హౌస్ లీజుకు ఇచ్చానని తెలిపారు. ఆయన సమాధానంతో సంతృప్తి చెందని పోలీసులు వ్యక్తిగతంగా హాజరు కావాలని నోటీసులు ఇవ్వగా ఇవాళ విచారణకు హాజరయ్యారు.

### ఎస్ఎల్ బీసీ సహాయక చర్యల

# పురోగతిపై సమీక్ష

## టన్నెల్‌లో నిరంతరాయంగా కొనసాగుతున్నసహాయక చర్యలు

**మహా:** ఎస్ఎల్ బీసీ టన్నల్ వద్ జరుగుతున్న సహాయక చర్యల పురోగతిపై డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ శుక్రవారం సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. టన్నెల్ లోపల సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు ఆటానమస్ హైడ్రాలిక్ పవర్డు రోబోకు అనుసంధానంగా ప్రత్యేకమైన యంత్రాలను ఉపయోగించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో 30 హెచ్ పీ సామర్థ్యం గల లిక్విడ్ రింగ్ వాక్యూమ్ పంపు, వాక్యూమ్ ట్యాంకుతో కూడిన మెషిన్ ను సమర్థవంతమైన సహాయక చర్యల కోసం పంపినట్లు వెల్లడించారు. ఈ యంత్రాలు మట్టిని త్వరగా తొలగించేందుకు, టన్నెల్ లోపల పనులను వేగవంతం చేయడానికి ఉపయోగపడుతుందని వివరించారు. మాన్యువల్ డిగ్గింగ్ కు బదులుగా ఆటానమస్ హైడ్రాలిక్ పవర్డు రోబోను వినియోగిస్తున్నారని, ఇది అధునాతన సాంకేతికతతో టన్నెల్ లోపల డిగ్గింగ్ ప్రక్రియను నిర్వహిస్తుందని తెలిపారు., డిగ్గింగ్ ప్రక్రియలో ఏర్పడే మట్టిని వేగంగా బయటకు తీయడానికి ఈ ప్రక్రియను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వాక్యూమ్ ట్యాంకు ద్వారా వచ్చిన మట్టిని గంటకు 620 క్యూబిక్ మీటర్ల బురదతో కూడిన మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలించవచ్చని వివరించారు. అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానం గల యంత్రాల వినియోగం ద్వారా సహాయక చర్యలను మరింత సమర్థవంతంగా, వేగంగా పూర్తి చేయడానికి సహాయపడుతుందని తెలిపారు. ఆర్మీ, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీమ్, ఎన్ డీఆర్ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్), ఎస్ డీఆర్ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్), ర్యాట్ మైనర్స్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైడ్రా, అన్వి రోబోటిక్స్, దక్షిణ మధ్య రైల్వే, బృందాలు, సహాయక చర్యలలో పాల్గొంటున్నట్లు వివరించారు

### జగదీశ్ రెడ్డి సస్పెండ్‌పై

# వెల్లువెత్తిన నిరసనలు

## రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆందోళనలు

### అసెంబ్లీని అడ్డాగా చేసుకుని కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడుతుంది : బీఆర్ఎస్

### నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బీఆర్ఎస్

### ధన్యవాదాలు తెలిపిన మాజీ మంత్రి కేటీఆర్

**మహా :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని శాసనసభ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేయడంపై రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదిలాబాద్ టూ ఆలంపూర్ తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగా నినదించారు. జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికం అన్నారు. ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న బీఆర్ఎస్ గొంతు నొక్కేందుకే సిఎం రేవంత్ రెడ్డి సస్పెన్షన్లను ఆయుధంగా మలుచుకున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలకు ప్రతిరూపమైన అసెంబ్లీని తన నియంతృత్వ పోకడలతో రేవంత్ రెడ్డి భ్రష్టుపట్టించారని విరుచుకుపడ్డారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా చెప్పుకోవడానికి ఒక్క మంచి పని కూడా చెయ్యని రేవంత్ రెడ్డి, తన చేతకానితనం బయటపడొద్దనే అసెంబ్లీలో బీఆర్ఎస్ నాయకులపై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.



అసెంబ్లీలో తమ గొంతు నొక్కితే ప్రజా కోర్టులో తేల్చుకుంటామన్నారు. పార్టీ పిలుపు మేరకు తెలంగాణ గ్రామ గ్రామాన ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వాన్ని ఎండగట్టిన కార్యకర్తలు, నాయకులకు కేటీఆర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను, హామీల అమలు మోసాన్ని ఇదే స్ఫూర్తితో ఎప్పటికప్పుడు ఎండగడదామని కేటీఆర్ పిలుపునిచ్చారు.

### గ్రీన్ కార్డు ఉన్నంత మాత్రాన

# శాశ్వత నివాసం వచ్చినట్టు కాదు

## అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

### ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశమని వ్యాఖ్య

### తమలో ఎవరిని విలీనం చేసుకోవాలో అమెరికన్లు నిర్ణయిస్తారన్న వాన్స్

**మహా :** అమెరికాకు వెళ్లే ప్రతి ఒక్కరి కల అక్కడి గ్రీన్ కార్డు సాధించడమే. గ్రీన్ కార్డు వస్తే అమెరికా పౌరసత్వం లభిస్తుంది. దీంతో, అమెరికా పౌరులుగా అక్కడే సెటిల్ కావచ్చు. అయితే, అమెరికా గ్రీన్ కార్డుపై ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్రీన్ కార్డు పొందినంత మాత్రాన ఎల్లకాలం ఇక్కడ ఉండపోయే హక్కు ఉండదని చెప్పారు. ఇది వాక్ స్వాతంత్ర్యానికి సంబంధించిన అంశం కాదని... దేశ భద్రతకు సంబంధించిన అంశమని అన్నారు. అమెరికా పౌరులుగా తమలో ఎవరిని విలీనం చేసుకోవాలో అమెరికన్లు నిర్ణయిస్తారని చెప్పారు. అమెరికా చట్టాల ప్రకారం గ్రీన్ కార్డు పొందిన వ్యక్తి నుంచి కొన్ని సందర్భాల్లో దాన్ని తిరిగి తీసుకోవచ్చు. సుదీర్ఘకాలం





అమెరికాలో లేకపోయినా, నేరాలకు పాల్పడినా, వలస నిబంధనలు పాటించడంలో విఫలమైనా గ్రీన్ కార్డును వెనక్కి తీసుకునే అవకాశం ఉంది.

# అమ్మాయి వలపు వల

## మిలిటరీ రహస్యాలు పాక్‌కు లీక్.. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగిని అరెస్టు చేసిన పోలీసులు

**మహా :** పాకిస్థాన్ ఐఎస్ఐకు గూఢచర్యం చేస్తూ.. భారత రక్షణ రంగానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని శత్రువులకు చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై ఉత్తరప్రదేశ్‌లో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ అమ్మాయి వలపు వల)లో చిక్కిన అతడు.. భారత సైన్యం ఆయుధాలకు సంబంధించిన సున్నితమైన సమాచారంతో పాటు గగన్‌యాన్ ప్రాజెక్టు వివరాలను అందించినట్లు విచారణలో తేలింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రవీంద్ర కుమార్ ఫిరోజాబాద్‌లో హజ్రత్‌పూర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది అతడికి నేహా శర్మ అనే మహిళ ఫేస్‌బుక్‌లో పరిచయమైంది. పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కోసం పనిచేస్తున్న ఆమె ఆ విషయాన్ని దాచిపెట్టి రవీంద్రతో స్నేహం చేసింది. డబ్బుల ఆశ జూపి వలపు వల విసిరింది. అనంతరం



అతడి నుంచి మిలిటరీ రహస్యాలను సంపాదించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. చంద్రన్ స్టోర్‌కీపర్ పేరుతో ఆమె నంబరును సేవ్ చేసుకున్న రవీంద్ర వాట్సప్‌లో ఆమెకు అనేక కీలక పత్రాలు పంపించినట్లు పోలీసులు గుర్తించారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, 51 గోర్ఖా రైఫిల్స్ రెజిమెంట్ అధికారులు నిర్వహించిన లాజిస్టిక్స్ డ్రోన్ పరీక్షలు, రోజువారీ ఉత్పత్తి వివరాలు, స్క్రీనింగ్ కమిటీ పంపిన రహస్య లేఖలను సంపాదించి వాటిని ఆ మహిళకు పంపించినట్లు తెలిసింది. ఇందులో గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అంతేకాదు పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న ఐఎస్ఐ సభ్యులతోనూ అతడు నేరుగా టచ్‌లో ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. భారత రక్షణ రంగ ప్రాజెక్టులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని వారికి పంపించి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడితో పాటు అతడి స్నేహితుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి వాట్సప్ చాట్‌లను పరిశీలిస్తున్నారు.

### పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో

### కళ్యాణ తలంబ్రాలు

# బుకింగ్

### అంతరాలయ అర్చన పరోక్ష సేవకు రు. 450

### తలంబ్రాలు పొందడానికి రు. 150

**మహా భద్రాచలం :** శ్రీరామ నవమి నాడు భద్రాద్రి పుణ్యక్షేత్రంలో నిర్వహించే శ్రీసీతారాముల కళ్యాణ తలంబ్రాలను తెలంగాణా రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి అందించేందుకు పోస్టల్ డిపార్ట్మెంట్ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఖమ్మం డివిజన్ సూపరింటెండెంట్ అఫ్ పోస్ట్ ఆఫీసెస్ వీరభద్ర స్వామి, భద్రాచలం పోస్ట్ మాస్టర్ బి వి రామ్మోహనరావు తెలిపారు. ముత్యాల తలంబ్రాల కొరకు రు. 150,అంతరాలయ అర్చనతో పాటు తలంబ్రాలు పొందే పరోక్ష సేవ కొరకు రు. 450 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సేవలు ఉపయోగించుకునే వారు ఏప్రిల్ 1 నుండి సమీప పోస్ట్ ఆఫీస్ లో ఆర్డర్ ఫారం లో వారి పేరు, గోత్రం, చిరునామా నింపి డబ్బులు చెల్లించాలని కోరారు.

# హోళీ వేడుకల్లో గంజాయి ఉత్పత్తులు

## గుట్టురట్టు చేసిన పోలీసులు

### గంజాయి కలిపిన ఐస్ క్రీం, గంజాయి బాల్స్ స్వాధీనం

**మహా :** హోలీ వేడుకల్లో గంజాయితో తయారు చేసిన కుల్ఫీ, ఐస్‌క్రీమ్‌తో పాటు గంజాయి బాల్స్ విక్రయిస్తున్న ముఠాను హైదరాబాద్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహానగరంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు విభిన్న రీతుల్లో హోలీ సంబరాలు చేసుకుంటారు. లోయర్ ధూల్‌పేట్‌లోని మల్చిపురాలో కుల్ఫీ, ఐస్‌క్రీమ్, బర్ఫీ స్వీటులో, సిల్వర్ కోటెడ్ బాల్స్‌లో గంజాయి వినియోగిస్తూ సంబరాలు చేశారు. పక్కా సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టీఎఫ్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేశారు. 100 కుల్ఫీలు, 72 బర్ఫీ స్వీట్లు, సిల్వర్ కోటెడ్ బాల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కుల్ఫీ, ఐస్‌క్రీమ్ విక్రయించే సత్యనారాయణ సింగ్ అనే వ్యక్తి గంజాయితో వీటిని తయారీ చేసినట్టు గుర్తించారు.



వెంటనే నిందితుడిపై కేసు నమోదు చేశారు. గంజాయి బర్ఫీ, చాక్లెట్లను స్వాధీనం చేసుకున్న సిబ్బందిని ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.వి. కమలాసన్ రెడ్డి అభినందించారు. నిత్యం కుల్ఫీ ఐస్‌క్రీమ్ అమ్మే సత్యనారాయణ సింగ్ గంజాయితో తయారు చేసిన కుల్ఫీ ఐస్ క్రీమ్, స్వీట్ల అమ్మకాలు జరుపుతున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు.

# రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం


## మంచుకొండ ఎత్తిపోతల పనులు వేగవంతం చేయాలి

### మార్చి 25 నాటికి పనులు పూర్తి చేయండి.. ప్రాజెక్టు పనులపై మంత్రి తుమ్మల సమీక్ష

**ఖమ్మం, మహా:** రాష్ట్రంలోని సాగు భూములను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా మంచుకొండ ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టామని, దీని పనులను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేయడం అత్యవసరమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు రైతుల జీవనోపాధిని మెరుగుపరిచే అద్భుత వ్యవసాయ దిశగా నిలవాలంటే, పనులు శీఘ్రంగా, నాణ్యతతో పూర్తి చేయడం తప్పనిసరి అని పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు పురోగతిని సమీక్షిస్తూ, పని వేగం, నిర్మాణ నాణ్యత, సాగునీటి సరఫరా వ్యవస్థ అభివృద్ధి వంటి అంశాలపై అధికారులతో సమాలోచనలు జరిపారు. రైతుల సాగునీటి అవసరాలను తీర్చడానికి మంచుకొండ ఎత్తిపోతల పథకం కీలకమైనదని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఏ చిన్న లోపం కూడా రైతులకు తీవ్రంగా దెబ్బతీస్తుందని, కావుని పనులన్నీ అత్యున్నత ప్రమాణాలతో ఉండాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే, ఖమ్మం పరిధిలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుంది. రైతుల కష్టాలను తీరుస్తుంది. అందుకే పనులు వేగంగా, నాణ్యతతో జరగాలి. కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు సమన్వయంతో పనిచేయాలి", అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో ప్రెజర్ మెయిన్స్, మోటార్ల ఏర్పాటు, కంట్రోల్ ప్యానెల్స్, ల్యాబ్ నిర్మాణం వంటి కీలక అంశాల పురోగతిని



మంత్రి స్వయంగా పరిశీలించారు. అధికారులను ప్రశ్నిస్తూ, అనుకున్న గడువులో పనులు పూర్తవుతాయా అనే దానిపై సమగ్ర సమాచారం కోరారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ అధికారులు మంత్రికి వివరణ ఇచ్చారు. మార్చి 17 నాటికి ప్రాజెక్టు మొదటి స్లాబ్ నిర్మాణం పూర్తి చేయనున్నారు. మార్చి 25 నాటికి ప్రెజర్ మెయిన్స్ పనులు పూర్తవుతాయని అధికారుల హామీ. అనంతరం నాగార్జునసాగర్ కాలువ నుంచి నీటిని విడుదల చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేస్తామని తెలిపారు.



# జనసేనాని జయకేతనం

## దేశంలో.. పవనం

### మోదీకి ఇష్టుడు.. జనం గుండె గెలిచిన ధీరుడు

*పవన్.. తెలుగునాట పొలిటికల్ తుఫాన్. తెలుగునాటే కాదు.. భారతదేశంలోనే మోదీకి అత్యంత ఇష్టులైన టాప్ టెన్ లీడర్లలో పవన్ చేరిపోయాడు. జనసేనాని.. జయకేతనానికి సంకేతంగా ఆవిర్భావసభ అబ్బురంగా జరిగింది. గత దశాబ్దంన్నర పోరాటానికి, ఆరాటానికి, ప్రజలపై ఉన్న ప్రేమకు, సమాజాన్ని మార్చాలన్న తపనకు, రాజకీయ తారగా వెలిగిపోవాలనుకున్న లక్ష్యానికి.. అన్నింటికీ ఒకే ఒక్క దెబ్బతో పవన్ కల్యాణ్ సమాధానం చెప్పారు. ఆ విజయాన్ని ఘనంగా జరుపుకునేందుకు ఆవిర్భావ సభ వేదికైంది. పవన్ గురించి.. గత ఏడాది కాలంగా దేశమంతా చర్చ జరుగుతోంది. ఒక నటుడు.. ఒక స్టార్ ఇన్ని దాడులు, ఢక్కీమొక్కీలు తిని సహనంతో రాజకీయాలు చేయగలడా? ఓర్పుగా ఉంటే కుంభస్థలాన్నైనా కొట్టొచ్చు అనడానికి పవనే రోల్ మోడల్ అని ప్రధాని మోదీ అనేకమందికి ఉదాహరణగా చెబుతున్నారంటే పవన్ జయకేతన స్థాయి స్పష్టమవుతోంది. పవన్ ఓ సునామీ..పవన్ ఓ తుఫాన్. పవనే రానున్న రోజుల్లో ఎన్డీఏ సాత్ వెపన్. మోదీ 3.0 సాకారంలో పవన్ పాత్ర స్పష్టం. పవన్ ఆంధ్రా గురించి ఆలోచిస్తే.. ఆయన వ్యూహం దేశ రాజకీయచిత్రాన్నే మార్చింది. అదీ పవన్ అంటే. ఇదీ రాజకీయ జయకేతనమంటే.*

### తిరుగులేని శక్తి

పవన్ రాజకీయాల్లో ఎన్నో డక్కాముక్కీలు తిన్నారు. ఎన్నో అవమానాలు భరించారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 12 సంవత్సరాలు యుద్ధం చేశారు. ఆ యుద్ధంలో తిరుగులేని గెలుపును సొంతం చేసుకున్నారు. 'నువ్వురాజకీయాలకు పనికి రావు' అన్న నోళ్లను మూయించటం కాదు.. అసెంబ్లీ గేటు కూడా తాకకుండా చేశారు. రాష్ట్రంలోనే కాదు.. కేంద్రంలోనూ తిరుగులేని రాజకీయ శక్తిగా ఎదిగారు. పవన్ కల్యాణ్ అంటే ఒక్క ఆంధ్రా రాజకీయాలే కాదు.. భారతదేశ రాజకీయాలు కూడా మాట్లాడుకునేలా విశ్వసనీయత, నిబద్ధత, నిజాయితీని సముపార్జించారు. ప్రత్యర్థులకు పవన్ పంజా చూపారు. అధికారంలోకి వచ్చాక ఎంత నిబద్ధతతో ఉండాలో కూడా పవన్ చేసి చూపాడు.

### కలిసొచ్చిన కాలం

జనసేనాని పవన్ కల్యాణ్ యువరాజ్యాధినేతగా తెలుగురాష్ట్రాల ప్రజల మనసులు చదివారు. రాష్ట్ర విభజన అనంతరం తానే జనసేన స్థాపించి వ్యూహాత్మక రాజకీయాలకు కేరాఫ్ గా మారారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేనకు, ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు బాగా కలిసొచ్చిన సంవత్సరం 2024 కాగా.. అప్పటి నుండి వెనక్కు తిరిగి చూసుకోకుండా రాజకీయం సాగుతోంది. 2014లో పార్టీని పెట్టినప్పటికీ ఆ ఎన్నికల్లో కూటమి విజయానికి ప్రచారం చేసిన పవన్‌కళ్యాణ్ పోటీకి దూరంగా ఉన్నారు. 2019లో తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసిన జనసేన కేవలం ఒక సీటును మాత్రమే గెల్చుకుంది. జనసేనాని అయితే పోటీ చేసిన గాజువాక, భీమవరం రెండుచోట్ల ఓడిపోయారు. అదే జనసేన 2024లో పోటీచేసిన 21 శాసనసభ, రెండు పార్లమెంట్ స్థానాల్లో గెలుపొంది వంద శాతం స్ట్రైక్ రేట్ సాధించింది. 2024 ఎన్నికల తర్వాత జనసేన పార్టీ ఉండదని, పవన్ కళ్యాణ్ రాజకీయాలకు పనికిరారంటూ ఎంతోమంది ఎన్నో విమర్శలు చేసినా ఆయన పట్టించుకోలేదు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై అవగాహన పెంచుకున్నారు. ఏవిధమైన వ్యూహాలతో ముందుకెళ్లాలో సరిగ్గా అంచనా వేయగలిగారు. అప్పటి అధికారపక్షం వైసీపీ ఎన్ని ఇబ్బందులు పెట్టినా, వ్యక్తిగతంగా టార్గెట్ చేసినా వెనక్కి తగ్గలేదు.. ప్రతి విమర్శకు ధీటైన జవాబు ఇస్తూ ముందుకుసాగారు. అందుకే జయకేతనం ఎగురేశారు. ఏపిలో విభజతో కొత్తగా పెరిగే స్థానాలన్నీ జనసేనకే. వచ్చే ఎన్నికల్లో జనసేన కనీసం 75స్థానాల్లో పోటీచేసే దిశగా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. పోటీచేసిన ప్రతీస్థానం గెలవడమే జనసేన వ్యూహంగా సాగుతోంది.

### ఇది ట్రైలరే



**రాజకీయరంగంలో జనసేనకు అద్భుతంగా కలిసొచ్చింది. ఏడాది క్రితం ఎంతలా విజయాలు లభించాయంటే.. ఇక ఇంతకుమించి ఎవరు సాధిస్తారబ్బా అనేరీతిలో వందశాతం స్ట్రైక్ రేట్ తో దుమ్మురేపారు. సార్వత్రిక ఎన్నికల్లో వంద శాతం స్ట్రైక్ రేట్ సాధించిన పార్టీగా జనసేన రికార్డు సృష్టిస్తే.. అంతకు ముందు ఎన్నికల్లో దక్కించుకున్న సీట్లలో పదో వంతు కూడా దక్కించుకోలేక వైసీపీ పూర్తిగా చతికిల పడింది . పోటీచేసిన అన్ని శాసనసభ, పార్లమెంట్ స్థానాల్లో జనసేన అభ్యర్థులు గెలుపొంది దేశం దృష్టిని ఆకర్షించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రచారం చేసి నేషనల్ ఇమేజ్ సొంతం చేసుకున్న జనసేనాని ప్రధాని మోడీ ప్రశంసలు అందుకుంటూ పొలిటికల్ స్క్రీన్‌పై అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ప్రత్యర్థుల ప్రశంసలు పొందే రాజకీయాలు చేస్తూ.. ఇదీ పవన్ అంటే అనిపిస్తున్నారు. మరోవైపు సోదరుడు నాగబాబును కూడా ఎమ్మెల్సీ చేశారు. త్వరలో ఆయన కేబినెట్ లోకి రానున్నారు. ఇక పవన్ ఇప్పటిదాకా సాధించింది ట్రైలరే. ముందుంది అసలు సిన్మా అని ఆయన అభిమానులు, జనసైనికులు రొమ్మువిరిచి చెబుతున్నారు.**

### మాటమీద నిలబడే జనసేన

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల ముందు వరకు జనసేన ఓ రాజకీయపార్టీ.. ఎన్నికల తర్వాత ఆపార్టీ ఓ శక్తిగా మారింది. పవర్ ఉంటే ఏదైనా చేయ్యొచ్చు.. జనసేన లక్ష్యం చేరుకోవాలంటే పవర్ కావాలంటూ పవన్ కళ్యాణ్ పదేపదే వ్యాఖ్యానించేవారు. సరిగ్గా 2024 ఎన్నికల తర్వాత ఏపీ ప్రభుత్వంలో జనసేన భాగస్వామిగా మారింది. పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను పవన్ కళ్యాణ్ మర్చిపోలేదు. అధికారంలో ఉన్నా.. లేకపోయినా తాను ప్రజాసేవకుడినేనంటూ ముందుకు సాగారు. ప్రభుత్వ పరంగా తీసుకునే నిర్ణయాల్లో ఎక్కడా తొందరపాటు చూపించకుండా.. నిదానంగా ముందుకెళ్తూ.. అందుబాటులో ఉన్న వనరులతో ఏ విధంగా అభివృద్ధి చేయగలమో ప్రణాళికలు రచించుకుంటూ ముందుకెళ్తున్నారు. తనకు ఇష్టమైన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల బాధ్యతలను నిర్వర్తిస్తూ.. రాష్ట్రంలో తనదైన మార్క్ పాలనను ప్రజలకు చూపించేందుకు పవన్ కళ్యాణ్ ప్రయత్నిస్తున్నారు. సాధారణంగా ఏదైనా రాజకీయపార్టీ మత విశ్వాసాల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. తమది సెక్యులర్ పార్టీ అని అన్ని మతాలను సమానంగా చూస్తామని ప్రచారం చేసుకుంటారు. ఈ సమయంలో పవన్ కళ్యాణ్ మాత్రం సనాతన ధర్మాన్ని రక్షించుకోవల్సిన అవసరం ఉందని, తమ పార్టీ సనాతన ధర్మ పరిరక్షణకు కృషిచేస్తుందని బహిరంగంగా ప్రకటించడంతో పాటు తిరుపతిలో ఓ సభ ఏర్పాటుచేసి డిక్లరేషన్ ప్రకటించారు. మహారాష్ట్ర ఎన్నికలు దేశం దృష్టిని ఆకర్షించాయి. ఇండియా, ఎన్డీయే కూటమి మధ్య హోరాహోరీ పోరు నడిచింది. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి ఎక్కువ లోక్‌సభ స్థానాలు గెలుచుకోవడంతో శాసనసభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే ఉత్కంఠ నెలకొంది. రెండు కూటములు అధికారంపై ధీమా వ్యక్తం చేశాయి. చివరకు ఎన్డీయే కూటమి భారీ విజయం సాధించింది. ముఖ్యంగా గతంలో తెలుగు ఓటర్లు ఎక్కువుగా ఉండే నియోజకవర్గాల్లో కాంగ్రెస్ లేదా ఆ పార్టీ మద్దతు దారులు ఎక్కువుగా గెలుపొందేవారు. ఈసారి పవన్ కళ్యాణ్ తెలుగు ఓటర్లు ఎక్కువ ప్రభావం చూపించే నియోజకవర్గాల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ప్రచారం చేసిన అన్ని నియోజకవర్గాల్లో మహాయుతి కూటమి మంచి ప్రదర్శన కనబర్చింది. దీంతో పవన్ కళ్యాణ్ ఇమేజ్ తెలుగు రాష్ట్రాలు దాటి జాతీయస్థాయికి వెళ్లింది. అప్పటినుంచి పవన్ కళ్యాణ్ నేషనల్ లీడర్ అంటూ జనసైనికులు నినాదాలు హోరెత్తిస్తున్నారు. మరోవైపు ఎన్డీయే సమావేశాల్లో పవన్ కళ్యాణ్‌ను ప్రధాని మోడీ ప్రశంసలతో ముంచెత్తడం ఆయన ఇమేజ్‌ను దేశ స్థాయిలో మరింత పెంచింది. ఢిల్లీలోనూ పవన్ దుమ్మురేపారు. తమిళనాడు ఎన్నికల్లోనూ పవన్ ఎన్డీఏ బ్రాండ్ అంబాసిడర్ కాబోతున్నారు. తెలుగురాజకీయాల్లో పుష్కరకాలం తర్వాత పవన్ శకం ప్రారంభమైందని, మరో పుష్కరకాలం పవన్ శకానికి తిరుగులేదని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. . జనసేన ద్వారా ముగ్గురికి మంత్రి యోగం దక్కింది. త్వరలో నాగబాబు కూడా మంత్రి కానున్నారు. జనసేన మరెంతోమందికి పదవులు, బాధ్యతలు అప్పగించనుంది. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా జనసేన పనిచేస్తే వెనక్కు తిరిగి చూసే అవకాశమే ఉండదు.

**- కేఆర్**

# ప్రశ్నించే గొంతుకలను సస్పెండ్ చేస్తే ఊరుకోం

■ మఠంపల్లిలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**హుజూర్ నగర్, మహా :** అసెంబ్లీలో మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ లో సస్పెండ్ చేసినందుకు బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు, నియోజకవర్గ బిఆర్ఎస్ కోఆర్డినేటర్ఒంటెద్దు నరసింహారెడ్డి ఆదేశానుసారం సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఇరుగు పిచ్చయ్య ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ కూడలిలోభారీ ఎత్తున నిరసన వ్యక్తం చేసి ప్రభుత్వ దిష్టిబొమ్మని తగలబెట్టడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో ఇరుగు పిచయ్య , మాజీ సర్పంచ్ మన్నెం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏకపక్షంగా జగదీష్ రెడ్డిని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నుండి సస్పెండ్ చేయటం దుర్మార్గమని ఆరు హామీలను అమలు చేయకపోవడాన్ని ప్రశ్నిస్తారని ఇలా బిఆర్ఎస్ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని, చాతనైతే పాలనలో సత్తా చూపించి ప్రజల అభిమానాన్ని చూరగొనాలని అంతేతప్ప ఇలా ప్రశ్నించే గొంతుకుల సస్పెండ్ చేయడం అన్యాయమని దుయపట్టారు. ఇలాగే బిఆర్ఎస్ పార్టీపై ప్రభుత్వం దుర్మార్గాలకు పాల్పడితే మున్ముందు పెద్ద ఎత్తున ఉద్యమ తరహాలో అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వాన్ని ఎండగడతామని హెచ్చరించారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కుందూరు వెంకటరెడ్డి, బానోతు సైదమ్మ,బిఅర్ ఎస్ నాయకులు దాసరి వెంకటరమణ, కోలాహలం లక్ష్మీనరసింహారాజు, బానోతు పాండు నాయక్, టీక్యా నాయక్, గ్రంధాలయ చైర్మన్ భద్రంరాజు రామారావు, ఉప సర్పంచులు జాల కిరణ్ యాదవ్, చిన్నపంగు రాజీవ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పల్లె మట్టయ్య, మండల ఉపాధ్యక్షులు ఇరిగెల వెంకటరెడ్డి, మండల యువ నాయకులు పరాశరం అయ్యప్ప, పలు గ్రామాల పార్టీ అధ్యక్షులు వీరంరెడ్డి వీరారెడ్డి, మామిడి శ్రీను, కుర్రి కాశయ్య, శ్రీను నాయక్, కంబాల మురళి, మండల నాయకులు వల్లపుదాసు సురేష్, వల్లపుదాసు బాలకృష్ణ, మద్ది హుస్సేన్ రెడ్డి, పేరం కొండలు డాక్టర్ బడేసా, పలు గ్రామాల బిఆర్ఎస్ నాయకులు రామాచారి, దేవపంగు రవి, ఆరాల వీరస్వామి, కాటేపల్లి మల్లేష్, యూత్ అధ్యక్షులు అయితగాని వీరబాబు, షేక్ రహీం, నరాలశెట్టి గోపి, డాబా శ్రీను, దవనం వెంకటేశ్, షేక్ నబి, వెంకటేష్, ఆర్ఎంపీ సైదులు, మూడ్ సైదా, సీతారామయ్య, మల్లెల శ్రీను, వెంకన్న, మల్ రెడ్డి గోపాల్ రెడ్డి, భూక్య బాబు, అయితగాని నరేందర్, మరియు పలువురు బిఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉత్సాహంగా హోలీ సంబరాలు








**హన్మకొండ, మహా :** హోలీ సందర్భంగా శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలిసి పోలీస్ కమిషనర్ తీన్మార్ స్టెప్పులతో సందడి చేసారు. హోలీ పండుగను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో ఘనంగా జరుపుకున్నారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్న అధికారులు సిబ్బంది ముందుగా పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌కు అధికారులు, సిబ్బంది రంగులు పూయడంతో ప్రారంభమైన హోలీ సంబురాల్లో సిపితో పాటు డిసిపి, ట్రైనీ ఐపిస్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది సైతం తమ స్థాయిలను మరిచి బ్యాండ్ వాయిద్యాల నడుమ తీన్మార్ స్టెప్పులతో హోలీ సంబురాల్లో మునిగితేలారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్‌తో ఇతర పోలీసులు సైతం బ్యాండ్ వాయిస్తూ పోలీసులతో జోష్‌ని నింపడంతో అధికారులు, సిబ్బంది ఉత్సహంగా స్టెప్పులు వేస్తూ పరస్పరం హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుపోవడంతో పాటు పోలీస్ కమిషనర్‌ను అధికారులు సిబ్బంది వారి భుజాలపై ఎత్తికొని పోలీసులు నృత్యాలతో కేరింతలు కొట్టారు. పండుగ వేళ పోలీస్ కమిషనర్ విధులు పోలీస్ సిబ్బందికిరంగులు రాసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీడియా ప్రతి నిధులు, సిబ్బంది సైతం పోలీసులతో కలిసి హోలీ సంబురాల్లో పాల్గోని డీజే టిల్లు పాటలకు చిందేసారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, ఏ.ఎస్పీ మనన్‌భట్, అదనపు డిసిపి సురేష్‌కుమార్‌తో పాటు ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఆర్.ఎస్.ఐలతో పాటు సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాల్గోన్నారు.

**సంబరాల్లో పాల్గొన్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే**

హోలీ సంబురాల సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పోలీస్ కమిషనరేట్‌కు చేరుకోని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పరస్పర ఇరువురు రంగులు పూసుకొని హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం పశ్చిమ ఎమ్మెల్యే పోలీస్ కమిషనర్ తీన్మార్ స్టేప్పులు వేసారు. పశ్చిమ ఎమ్మెల్యే వెంట మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఈ.వి శ్రీనివాస్, తదితరులు వున్నారు.

## హోలీ వేడుకల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, మహా;** వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తన కుటుంబ సమేతంగా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, పలు శాఖల జిల్లా అధికారులు, టి జి ఓ, టి ఎన్జి ఓస్, తదితర సంఘాలు, తోటి ఉద్యోగస్తులతో కలిసి శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో హోలీ వేడుకలను ఉత్సాహంగా ఘనంగా జరుపుకున్నారు. వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయినీ రాజేందర్ రెడ్డి,గ్రేటర్ వరంగల్ నగర మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఈ వి శ్రీనివాస్, నగర ప్రముఖులు కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలసి హోలీ వేడుకల్లో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ఉపాధి హామీ పథకం ను నిర్వీర్యం చేయడమే బీజేపీ లక్ష్యం



**అనకాపల్లిజిల్లా, ఎస్.రాయవరం , మహా :** ఉపాధి హామీ పథకం ను నిర్వీర్యం చేయడమే బి.జె.పి లక్ష్యమని అందుకే బడ్జెట్ లో తగిన నిదులు కేటాయింపులు చేయడం లేదని అనకాపల్లి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ అన్నారు.జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పని చేస్తున్న కూలీలను కలసిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. ఎస్.రాయవరం మండలం రామయ్య పట్నం లో ఉపాది కూలీలకు సుమారు ఆరు వారాలు కూలీడబ్బులు బకాయిలు ఇవ్వకపోవడం పై వినూత్న నిరసన తెలిపారు. ఉపాధి కూలి డబ్బులు ఇవ్వకపోతే మేము గడ్డి తిను బతకాలా ? అంటూ ప్లేట్లు పట్టుకొని తిండి అయినా పెట్టండి డబ్బులు అయినా ఇవ్వండి అంటూ నిరసన తెలిపారు. బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. వేసవి కాలం పారంభం అయినప్పటికీ పని ప్రదేశంలో టెంట్లు ఎర్పాటు చేయకపోవడం పై మండిపడ్డారు.,దూర ప్రాంతాల వారికి రవాణా,మంచినీటి సౌకర్యం కల్పించలేదని ,వారం మద్యలో ఇతర అవసరాల వల్ల పనికి రాకపోయినా అ పని దినాలను కల్పించవలసిన అవసరం ఉందన్నారు.కూలి 600/ కి పెంచి 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమం లో మెట్ ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# నియోజక వర్గ వ్యాప్తంగా హోలీ వేడుకలు



**హుజూర్ నగర్, మహా :** హుజూర్ నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా హోలీ వేడుకలు అంబరాన్ని అంటాయి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు తీరొక్క రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఇక చిన్నారులు మహిళల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున హోలీ వేడుకలు జరుపుకొని సంతోషం వ్యక్తం చేశారు. యువకులు డప్పు చప్పుళ్లతో వీధుల్లో తిరుగుతూ హోలీ వేడుకలు నిర్వహించారు. హోలీ వేడుకలలో భాగంగా హుజూర్నగర్ సిఐ చరమంద రాజు ప్రత్యేక ఆకర్షణగా చిన్నారులు, జర్నలిస్ట్ ల మధ్య హోలీ వేడుకలు జరుపుకున్నారు. పోలీస్ వారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

## గంజాయి నిర్మూలన పై కఠిన చర్యలు

■ డీఎస్పీ రవీందర్




**ములుగు, మహా :** ములుగు సబ్‌డివిజన్ లో పశువుల అక్రమ రవాణాకు, గంజాయి నిర్మూలనపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ ఎన్ రవీందర్ శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. జిల్లా పోలీసు అధికారులు అందుకుగాను అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. 2024ఏడాదిలో అక్రమంగా పశువులను తరలిస్తున్న వారిపై 30కేసులు నమోదు చేసి 296పశువులను సంరక్షించి గోశాలలకు తరలించామని తెలిపారు. ఈ కేసులలో 85మంది నేరస్తులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాదిలో జనవరి 1నుంచి అక్రమంగా పశువులను తరలిస్తున్న ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. 8పశువులను సంరక్షించి గోశాలలకు తరలించడం జరిగిందన్నారు. అదేవిధంగా గంజాయి వంటి మత్తు పదార్థాలకు సంబంధించి సబ్‌డివిజన్ లో 2024 సంవత్సరంలో మొత్తం 4కేసులు నమోదు చేసి రూ.1,09,242 విలువ కలిగిన 11.413 కేజీ ల గంజాయిని స్వాదినం చేసుకున్నామన్నారు. 9మంది కేసులను నమోదు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. అదేవిదంగా ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.62,125విలువ కలిగిన 2.485కేజీ ల గంజాయిని స్వాదినం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదుచేసి రిమాండ్ కు తరలించామన్నారు. గంజాయి రహిత సమాజం కోసం జిల్లా పోలీసులు పని చేస్తున్నారని, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. యాంటీ నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేపడుతున్నామన్నారు. గంజాయికి సంబంధించిన సమాచారాన్ని 1908కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## హోలీ సంబరాల్లో పాల్గొన్న బల్దియా కమిషనర్



**వరంగల్, మహా :**హోలీ పండుగను పురస్కరించుకొని శుక్రవారంబల్దియా కమిషనర్ క్యాంపు కార్యాలయం లో వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భం గా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే కుటుంబసభ్యులు, అధికారులు, క్యాంపు కార్యాలయ సిబ్బంది తో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం అధికారులు సిబ్బంది కమిషనర్ కు హోలీ పర్వదినం ను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎం హెచ్ ఓ రాజేష్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఈ ఈ లు రవి కుమార్, శ్రీనివాస్, డి ఈ లు రంగారావు, కృష్ణ మూర్తి, ఏ ఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం



**మోత్కూర్, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం శుక్రవారం ఉదయం భక్తిశ్రద్ధలతో అద్భుతంగా జరిగాయి. వేద మంత్రోచ్చారణల నడుమ, అర్చకుల మంత్రపఠనంతో స్వామి వారికీ మంగళ వివాహం ఘనంగా నిర్వహించారు.శ్రీ స్వామివారి కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తుల జయజయధ్వానాలు, మంగళ వాయిద్యాల నాదం ఆలయ పరిసరాలను మారుమ్రోగించాయి. వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన కల్యాణ మహోత్సవం భక్తుల హృదయాల్లో భక్తి తరంగాలను పుట్టించింది. ఉత్సవం సందర్భంగా స్వామివారి మూల విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అలంకారాలు నిర్వహించగా, కళ్యాణ వేడికను పుష్పాలతో అందంగా శోభాయమానంగా ముస్తాబు చేశారు. స్వామి వారి కళ్యాణ సమయానికి ఆలయ ప్రాంగణం పుణ్యప్రవాహంగా మారింది. అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వామివారి పాణిగ్రహణ కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు ఆనందోత్సాహాలతో కాంక్షించి స్వామివారికి కర్పూర హారతులు సమర్పించారు. వేడుకకు భక్తుల కేరింతలు, శంఖనాదాలు విశేష శోభను చేకూర్చాయి. పుష్పవర్షం మధ్య భక్తుల కోలాహలంతో ముగిసిన శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం భక్తుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా అనిపించింది అని అన్నారు,

# ముగిసిన లక్ష్మీనరసింహ జాతర



**ములుగు, మహా :** ములుగు మండలంలోని కొత్తూరు గుట్టపై వెలిసిన అతి ప్రాచీన దేవాలయం శ్రీ లక్ష్మీనరసింహుని జాతర హోళీ వేడుకలతో ముగిసింది. మూడు రోజులుగా అభిషేకాలు, అర్చనలు, కళ్యాణ కార్యక్రామలు నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు, సమీప గ్రామాల ప్రజలు చివరి రోజు శుక్రవారం హోమం నిర్వహించారు. ప్రధాన అర్చకులు ముడుంబా రఘునందనాచార్యులు పూజాకార్యక్రమాలు నిర్వహించగా ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరంనేని కిషన్ రావు, గ్రామ పెద్ద రవీందర్ రావు దంపతులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. బండ్లు తిప్పి భక్తులు మొక్కులు చెల్లించారు. గుట్ట కింద భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు తాగునీటి సదుపాయం కల్పించారు. కొత్తూరుతోపాటు ములుగు మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 10వేల మంది భక్తులు మూడురోజులపాటు లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ అధ్యక్షుడు కిషన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా పీహెచ్సీ రాయినిగూడెం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## గోవిందాద్రి కొండ పై వైభవంగా వసంతోత్సవం



**వరంగల్, మహా ;** చరిత్రకు నిలయమైన వరంగల్ నగర నడి మధ్యన గోవిందాద్రి కొండ పై స్వయంభుగా వెలసిన శ్రీదేవి భూదేవి నీలాదేవి సతీసమేతుడైన శ్రీ గోవిందరాజస్వామి దేవస్థానం యందు శుక్రవారం సాయంత్రం శ్రీ గోవిందరాజ స్వామి ప్రధానార్చకులు శ్రీ వరయోగుల శ్రీనివాసా స్వామి, ఆలయ కార్య నిర్వహణ అధికారి మిట్టపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో శ్రీ గోవిందరాజ స్వామి ఉత్సవమూర్తుల ఆలయం నుండి శ్రీ గోవిందరాజ స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మేళ తాళాలతో మంగళ వాయిద్యాలతో అశేష భక్తజన బాంధవులు వెంటరాగా ఊరేగింపు వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీ గోవిందరాజ గుట్టపైకి ఉత్సవ మూర్తులను తీసుకువచ్చి గుట్టపైన స్వామివార్లకు వసంతోత్సవం నిర్వహించారు. గుట్టపై ఆలయంలో స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ వరయోగుల శ్రీనివాస స్వామి తో పాటు తిరునగరి నరసింహస్వామి వరయోగుల లక్ష్మణస్వామి . సంతోష్ స్వామి. వరయోగుల వెంకటేశ్వర్లు. వరయోగుల ప్రసాద్. వరయోగుల మురళీకృష్ణ అర్చక బృందం శ్రీ గోవిందరాజ స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు వసంతోత్సవాన్ని ఎంతో వైభవోపేతంగా నిర్వహించారు. తర్వాత మళ్లీ ఉత్సవమూర్తులను గుట్టపై నుండి ఊరేగింపుగా పురవీధుల గుండా స్వామి వారిని భక్తుల దర్శనార్థం తీసుకోవస్తుండగా స్థానిక భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున అఖండ మంగళహారలతో స్వామివారికి మంగళ నీరాజనాలు పలికారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానిక భక్తులు విచ్చేసి వసంతోత్సవం లో భాగస్వాములై స్వామి వారి దర్శనం చేసుకొని స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులైయ్యారు. అనంతరం ఉత్సవ మూర్తులు ఉన్న ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి, శేటగోపంతో వారికి మహా ఆశీర్వచనాలు అందించారు.

## కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలన



**వరంగల్, మహా;** వరంగల్ జిల్లాలో ఏప్రిల్ 27 న కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభ ఏర్పాటు స్థలాన్ని దేవన్న పేట వద్ద పరిశీలించిన మాజీ మంత్రి హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి తో పాటు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రంగులలో మునిగితేలారు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** జిల్లాలో కాముని దహనం అనంతరం హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుండి చిన్నారులు, యువత, పెద్దలు రంగురంగుల కలర్స్ చల్లుకుంటూ హోలీ సంబరాల్లో మునిగితేలారు. చిన్న పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు పోసుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొన్ని ప్రాంతాలలో డీజే ధ్వనుల మధ్య యువత కేరింతలతో హోలీ పండగ అంగరంగ వైభవంగా జరుపుకోవడం జరిగింది. రంగారెడ్డి జిల్లాలోని ఎల్బీనగర్, ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాద్నగర్, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో హోలీ సంబరాలు చిన్నారులు యువతీ యువకులు ఘనంగా జరుపుకున్నారు. ఇంజనీరింగ్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పండుగకు ఒక రోజు ముందు తమ తమ కళాశాలలో హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ పర్వదినం అందరి జీవితాల్లో సంతోషం, ఆనందం, ప్రేమ మరియు కొత్త ఆశయాలు నింపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. హోలీ అనేది ప్రేమ, ఐక్యత, రంగుల సమ్మేళనం. ఈ ప్రత్యేక పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో కలిసి సంతోషంగా జరుపుకోని, జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆనందగా ఉండాలని, కొత్త ఆశయాలతో, కొత్త విజయాల సాధన కోసం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. హోలీ పండుగ అందరినీ ఒకే రంగులో కలిపే పండుగ. ఈ హోలీ మీ జీవితాల్లో అనేక రంగులను, విజయాలను నింపాలని కోరుకుంటూ, మరోసారి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

## రంగుల మయం.. సంబురంగా హోలీ







**కరీంనగర్ ఉమ్మడి జిల్లా, మహా :**,ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారు హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఒకరిపై ఒకరు హోలీ పోసుకోని రంగుల పండుగను జ రుపు కోవడం విశేషం. చిన్నా, పెద్దా, యువతీ, యువకులు, అధికారులు, వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు, నా యకులు, కార్యకర్తలు, పురుషులు, మహిళలు అనే తారతమ్యం చే కుండా అందరూ కలిసి రంగుల్లో మునిగితేలారు. కరీంనగర్కి పాటు జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లా ల కేంద్రంలోని వీధి వీధుల్లో డప్పు చప్పుళ్లు, డిజె సౌండ్ల మధ్యన ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ హోలీ పండుగను అత్యంత ఘనంగా నిర్వహించుకున్నారు. పురుషులు, మహిళలు, చిన్నారులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పరస్పరం రంగులు చల్లుకు న్నారు. బృందాలుగా ఏర్పడి స్నేహితుల ఇండ్లల్లోకి తిరుగుతూ రంగులు చల్లుకుంటూ పర్వ ఉనాన్ని జరుపుకున్నారు. కరీంనగర్ తోని ఎంపి కార్యాలయంతో కేంద్ర పోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసాలతో పాటు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పలువురు అడ్వకేట్స్ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా వివిధ జిల్లా కేంద్రలలో సైతం ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, జిల్లా పోలీస్ అధికారులు, వివిధ శాఖల కు చెందిన బధికారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆనందనోత్సాహాల మధ్య రంగులు చల్లుకున్నారు

## హోలీ వేడుకల్లో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్, మహా :** హోలీ పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని కాంగ్రెస్ నాయకుడు అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వూటుకూరు నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.. శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రం లోని తన క్యాంపు కార్యాలయంలో హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి.. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, తన అనుచరులతో కలిసి నరేందర్ రెడ్డి హోలీ సంబరాల్లో పాల్గొన్నారు . యువకులతోకలసి రంగులు చల్లుకుంటూ పాటలకు స్టెప్పులు వేశారు. ప్రతి ఒక్కరు హోలీ పండుగను సంతోషంగా జరుపుకోవాలని జీవితం రంగుల మయమయ్యే దారిని ఎంచుకోవాలని అన్నారు.. రంగుల కాంతులతో నింపి, ఆనందం, సుఖశాంతులు, ఆరోగ్యం, సమృద్ధిని తెచ్చిపెట్టాలని ఆకాంక్షించారు

## అంబరాన్నంటిన హోలీ



**వరంగల్, మహా;** వరంగల్ హనుమకొండ జిల్లాల్లో హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. శుక్రవారం జిల్లాల వ్యాప్తంగా చిన్నా పెద్ద తేడా లేకుండా వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఘనంగా హోలీ వేడుకలు ఆటపాటలతో యువత సందడితో హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. మంగళవారం జిల్లా వ్యాప్తంగా చిన్నా పెద్ద తేడా లేకుండా వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. రంగులు పూసుకొని కేరింతలు కొట్టారు. యువత డ్యాన్స్ చేస్తూ ఉత్సాహంగా గడిపారు. గ్రేటర్ వరంగల్ నగరంలో సామూహికంగా వేడుకలు నిర్వహించారు. పలుచోట్ల కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో పాటు వ్యాపార సంఘాలు, మహిళలు హోలీ సంబురాల్లో పాల్గొని ప్రజల్లో ఉత్సాహం నింపారు. వరంగల్ 28వ డివిజన్ బిజెపి కార్పొరేటర్ గందె కల్పన నవీన్ స్థానిక ప్రజలతో మమేకమై రంగులు పూసుకొని డివిజన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోలీ పండుగలోని రంగుల వలే ప్రజలు ఆనందోత్సవాలతో జీవించాలని ఆకాంక్షించారు.

## హోలీ.. రంగేళి



**మోత్కూర్, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో హోలీ వేడుకలు అంబరాన్ని అంటాయి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు తీరొక్క రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇక చిన్నారులు మహిళల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున హోలీ వేడుకలు జరుపుకొని సంతోషం వ్యక్తం చేశారు. యువకులు డప్పు చప్పుళ్లతో వీధుల్లో తిరుగుతూ హోలీ వేడుకలు నిర్వహించారు. హోలీ వేడుకలలో భాగంగా ఈ వేడుకల్లో రాజకీయ నాయకులు వ్యాపారవేతలు తదితరులు రంగులకే పరిమితమై రంగవల్లులతో, ఆటలతో పాటలతో వారి సంతోషాలకు హద్దు హల్పు సొలుపు లేకుండా జరుపుకున్నారు,

## ప్రజాసమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలి

- సీపీఐ శ్రేణులకు చాడ వెంకటరెడ్డి పిలుపు
- కరీంనగర్ లో ఘనంగా అనభేరి 77వ వర్ధంతి




**కరీంనగర్, మహా :** భూమి కోసం,భుక్తి కోసం,వెట్టిచాకిరి విముక్తి కోసం,అణగారిన వర్గాల కోసం తమ ప్రాణాలను తృణ ప్రాయంగా వదిలిన తెలంగాణ రైతాంగ సాయిధ పోరాట అమరవీరుల ఆశయాలను కొనసాగించడానికి భారత కమ్యూనిస్టు పార్టీ.సీపీఐ శ్రేణులు మరింత పట్టుదలతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి సీపీఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ కరీంనగర్ జిల్లా మొట్టమొదటి కార్యదర్శి అనభేరి ప్రభాకర్ రావు 77వ వర్ధంతి సందర్భంగా నగరంలోని వెంకటేశ్వర టెంపుల్ ముందు గల అనభేరి ప్రభాకర్ రావు విగ్రహానికి సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి తో కలిసి చాడ వెంకటరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలోని నిజాం నవాబుల పరిపాలన సమయంలో ప్రజల నుండి పన్నులు వసూలు చేస్తూ, వెట్టి చాకిరి చేయించుకుంటూ, ప్రజలను బానిసలుగా చూసే రోజుల్లో తిమ్మాపూర్ మండలం పోలంపల్లి గ్రామంలో భూస్వామ్య కుటుంబంలో జన్మించిన అనభేరి ప్రభాకర్ రావు తన చిన్నతనం నుండే ఎదిరించే స్వభావాన్ని కలిగి ఉన్నాడని, ఆనాటి పరిస్థితులను అంచనా వేసి పేదల కోసం నిజాం పరిపాలకులను,వారి తాబేదారులైన రజాకార్లను,దేశ్ ముఖ్ లను ఎదిరించడానికి ఆంధ్ర మహాసభలో చేరి ప్రజలను చైతన్యపరచాడని, దున్నేవానికి భూమి కావాలని, వెట్టి చాకిరి విముక్తి కావాలని 1947 సెప్టెంబర్ 11న ఆనాటి ఆంధ్ర మహాసభ,కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులైన రావి నారాయణరెడ్డి బద్దం ఎల్లారెడ్డి మఖ్దూమ్ మోహియుద్దీన్ లు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునివ్వడంతో ఆ పిలుపుని అందుకొని అనభేరి ప్రభాకర్ రావు,సింగిరెడ్డి భూపతిరెడ్డిల తో పాటు మరొక పదిమంది దళం నిజాం నవాబులపై,రజాకారుల పై వీరొచితంగా పోరాటం నిర్వహించారని,1948 మార్చి 14న మాందాపూర్ గుట్టల్లో భోజనం చేస్తున్న వారిపై రజాకార్ల పోలీసు మూకల కాల్పుల్లో అనభేరి ప్రభాకర్ రావు,భూపతి రెడ్డి తో పాటు మరో పది మంది వీరమరణం చెందారని, ప్రజల కోసం పనిచేసే అమరత్వం పొందిన అమరవీరుల ఆశయాలను కొనసాగించడం కోసం కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజల మధ్య ఉండి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు ,పోరాటాలు నిర్వహించాలని, అమరవీరులు సాగించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని మతోన్మాద బిజెపి పార్టీ వక్రీకరిస్తుందని వారి మాటలను తిప్పికొట్టేందుకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల చరిత్ర సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదని, ఆనాడు సాయిధ పోరాటమే సీపీఐ నిర్వహించకపోతే నేటి తెలంగాణలో పరిస్థితులు భిన్నంగా ఉండేవని, నిజాం నవాబుల కింద బానిసలుగా ఉండేదని, రజాకార్లు, దేశ్.ముఖ్ ల ,పటేల్ పట్వారి, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే నేడు మనం అనుభవిస్తున్న స్వతంత్ర ఫలమని వెంకటస్వామి అన్నారు.అనభేరి ప్రభాకర్ రావు తో పాటు సింగిరెడ్డి భూపతిరెడ్డి లాంటి అమరవీరుల జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి, రానున్న భవిష్యత్ తరాలకు తెలియజేసే విధంగా పాలక ప్రభుత్వాలు పనిచేయాలని అన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ పొనగంటి కేదారి గారు, జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్స్ కొయ్యడ సృజన్ కుమార్,అందె స్వామి,బోయిని అశోక్,కసిరెడ్డి సురేందర్ రెడ్డి,గూడెం లక్ష్మి,టేకుమల్ల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికారెడ్డి బుచ్చన్న యాదవ్,పైడిపల్లి రాజు ,పిట్టల సమ్మయ్య,నాలువాల సదానందం,బోనగిరి మహేందర్,న్యాలపట్ల రాజు వీరితో పాటు ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

## తండ్రి ఆశయాన్ని నెరవేర్చిన ఎస్ఎస్సీ బ్యాచ్ మిత్రులు



**మోత్కూరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోనీ మిత్రుడి కూతురు కూసిన గుర్తించి చదువులకు 60 వేల ఆర్థిక సహాయం తండ్రి ఆశయాన్ని నెరవేర్చేందుకు, కూతురు కృషిని గుర్తించి, మిత్రబృందం ఆ కుటుంబానికి చేయూతనిచ్చింది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీకి చెందిన మేడిగ రవి మిషన్ కొట్టుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు కుమార్తె మెడికల్ ఎడ్యుకేషన్లో మొదటి అడుగు వేసిన సందర్భంగా, 198788 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు కలిసి ఆమెను అభినందించారు. పేదరికం విద్యార్జనకు అడ్డంకి కాకూడదని, రవి కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన మిత్రులు, ఆమె విద్యాభ్యాసానికి చేయూత అందించారు. అందరి మిత్రులూ కలసి సుమారు 60,000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఒకే తరగతి గదిలో కూర్చొని చదువుకున్న మిత్రులంతా, కాలం గడిచినా తమ బంధాన్ని నిలబెట్టుకుంటూ, ఒకరి కోసం మరొకరు ఆదుకుంటూ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా మిత్రబృందం మాట్లాడుతూ, కష్టకాలంలో తోడు నిలవడమే నిజమైన స్నేహం. మా మిత్రుడు రవి కూతురు మెడికల్ సీటు సాధించిందని తెలియగానే మేమందరం ఎంతో గర్వించాం. కానీ ఆమె చదువులకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో చిన్న సహాయాన్ని అందించామని అన్నారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి ఎదిగి, గొప్ప వైద్యురాలిగా నిలవాలని మనసారా కోరుకుంటున్నాం అని భావోద్వేగంగా తెలిపారు. ఈ స్ఫూర్తిదాయక సంఘటన మోత్కూర్ ప్రాంతంలో అభినందనీయమైంది. అని అన్నారు.

## ఉత్తర తెలంగాణ కుతకుత

- ఆదిలాబాద్, మంచిర్యాల, జగిత్యాలలో వడగాల్పులు
- గరిష్టంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా మార్చి నెలలోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సాధారణం కన్నా 3.3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని ఐఎండీ అధికారి ధర్మరాజు తెలిపారు. రానున్న రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదయ్యే అవకాశం ఉందని ఆయన వివరించారు. వడగాల్పుల ప్రభావం ఆదిలాబాద్,కు మురంభీం, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో ఎండ తీవ్రతతో పాటు వడగాలుల ప్రభావం అధికంగా ఉంటుందని ఐఎండీ తెలిపింది. ఈ జిల్లాల్లో ఇప్పటికే ఎల్లో హెచ్చరికలను జారీ చేసినట్లు వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు తెలిపారు. శనివారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉన్నందున మరో 7 జిల్లాల్లోనూ శనివారం నుంచి ఎల్లో హెచ్చరికలు అమల్లోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

## కోర్టులో రన్యా రావుకు చుక్కెదురు

### కోర్టులో రన్యా రావుకు చుక్కెదురు
### ఎకనమిక్ అఫెన్సెస్ కోర్టులో రన్యా రావు బెయిల్ పిటిషన్
### బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన కోర్టు
### రెండో నిందితుడు తరుణ్ బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ



**మహా :** బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ప్రముఖ కన్నడ నటి రన్యా రావుకు ఎకనమిక్ అఫెన్సెస్ కోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. ఈ కేసులో రెండో నిందితుడు తరుణ్ కూడా బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు విచారించనుంది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు చేసిన విచారణలో రన్యా రావు పలు ఆసక్తికర విషయాలు వెల్లడించినట్లుగా సమాచారం. తనకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయని, యూట్యూబ్ వీడియోలు చూసి స్మగ్లింగ్ చేయడం నేర్చుకున్నానని ఆమె చెప్పినట్లుగా మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ కేసులో కొందరు వ్యక్తులు సిండికేట్‌గా ఏర్పడి స్మగ్లింగ్ దందాను నడిపిస్తున్నట్లు డీఆర్ఐ గుర్తించి, సీబీఐకి ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంలో పలువురు రాజకీయ నాయకులు, అధికారుల పాత్ర ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసులో అనుమానితులుగా భావించిన ఎవరికైనా సీబీఐ సమన్లు ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది.

## టాప్ ఐటీ కంపెనీకి కొత్త హెచ్ఆర్ హెడ్



దేశంలో అతిపెద్ద ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (TCS)కు కొత్త హెచ్ఆర్ హెడ్ నియమితులయ్యారు. సుదీప్ కున్నుమాల్‌కు పదోన్నతి కల్పిస్తూ చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ (సీహెచ్ఆర్‌వో)గా టీసీఎస్ నియమించింది. ప్రస్తుత హెచ్ఆర్ అధిపతి మిలింద్ లక్కడ్ పదవీ విరమణ చేస్తున్నారు. మార్చి 14వ తేదీ నుంచి కున్నుమాల్ చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరిస్తారని ఫైలింగ్‌లో టీసీఎస్ పేర్కొంది. సుదీప్ కున్నుమాల్ ప్రస్తుతం టీసీఎస్‌లో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) విభాగానికి హెచ్ఆర్ ఫంక్షన్ హెడ్‌గా ఉన్నారు. టాటా గ్రూప్ అనుబంధ సంస్థలో దాదాపు ఆరేళ్ల పాటు సీహెచ్ఆర్ఓ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న ప్రస్తుత మిలింద్ లక్కడ్ పదవీ విరమణ తర్వాత సీహెచ్ఆర్ఓ హోదాకు పదోన్నతి పొందారు. 1987లో టీసీఎస్‌లో ట్రైనీగా చేరిన లక్కడ్ 2006లో మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీస్ అధిపతి హోదాతో పాటు 38 ఏళ్ల పాటు పలు బాధ్యతలు నిర్వర్తించారు. 2019 నుంచి సీహెచ్ఆర్‌వోగా పనిచేస్తున్నారు.

**సుదీప్ కున్నుమాల్ గురించి..**

బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) వర్టికల్ కోసం హ్యూమన్ రిసోర్సెస్ ఫంక్షన్‌కు నేతృత్వం వహిస్తున్న సుదీప్ కున్నుమాల్ 2000 సంవత్సరం నుంచి ఐటీ రంగంలో పనిచేస్తున్నారు. మదురై కామరాజ్ యూనివర్సిటీ నుంచి హ్యూమన్ రిసోర్స్ మేనేజ్ మెంట్ లో మాస్టర్స్ పూర్తి చేశారు. వ్యూహాత్మక హెచ్ఆర్ చొరవలు, సరికొత్త నియామక పరిష్కారాలు, ప్రాసెస్ ఎక్సలెన్స్ ద్వారా సంస్థాగత వృద్ధిని పెంపొందించడంలో నిబద్ధతతో సుదీప్ కెరియర్ సాగిందని టీసీఎస్ పేర్కొంది. ఉత్తర అమెరికా, యూరప్‌తోపాటు ఆసియా పసిఫిక్ దేశాల్లో ఆయన వివిధ హెచ్ఆర్ లీడర్ షిప్ పొజిషన్లలో పనిచేశారు.

## ఇదీ హోలీ గిఫ్ట్ అంటే... ఉద్యోగులకు రూ.34 కోట్లు




హోలీ పండుగ సందర్భంగా పలు కంపెనీలు తమ ఉద్యోగులకు మిఠాయిలు, బహుమతులు ఇవ్వడం సాధారణమే. అయితే ఈ హోలీ సందర్భంగా ప్రూడెంట్ కార్పొరేట్ అడ్వైజరీ సర్వీసెస్ ప్రమోటర్ సంజయ్ షా కేవలం రంగులకే పరిమితం కాకుండా.. తన సిబ్బందికి రూ.34 కోట్ల విలువైన 1,75,000 ఈక్విటీ షేర్లను బహుమతిగా ఇస్తున్నారు. దాదాపు 650 మంది ఉద్యోగులు, వ్యక్తిగత సిబ్బంది దీంతో ప్రయోజనం పొందనున్నారు. ప్రూడెంట్ కార్పొరేట్ అడ్వైజరీ సర్వీసెస్ లిమిటెడ్ సీఎండీ సంజయ్ షా ఈ ఉదార చర్యతో వ్యాపారంలో 25వ ఏట అడుగుపెట్టారు. లబ్ధిదారుల్లో కంపెనీ ఉద్యోగులే కాకుండా ఆయన ఇంట్లో పనిచేసే సహాయకులు, డ్రైవర్లు వంటి వ్యక్తిగత సిబ్బంది కూడా ఉన్నారు.

**ఉద్యోగులకు రూ.కోట్ల షేర్లు ప్రకటించిన ప్రూడెంట్ ప్రమోటర్ సంజయ్ షా ఈయనే..**


ఈ సందర్భంగా సంజయ్ షా మాట్లాడుతూ.. 'ఇది కేవలం షేర్ల బదలాయింపు మాత్రమే కాదు. ఈ ప్రయాణంలో ఉద్యోగులుగా మాత్రమే కాకుండా సహచరులుగా నాకు అండగా నిలిచిన వారికి ఇవి నేను సమర్పించే హృదయపూర్వక ధన్యవాదాలు. మీ నిస్వార్థ సహకారాలు, విశ్వసనీయత, విధేయత అమూల్యమైనవి' అని పేర్కొన్నారు. సంజయ్ షా తన నిర్ణయాన్ని కంపెనీకి తెలియజేశారు. ఇందుకోసం సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)తో సహా అవసరమైన రెగ్యులేటరీ అనుమతులను ప్రూడెంట్ కార్పొరేట్ అడ్వైజరీ సర్వీసెస్ పొందింది. కాగా ఉద్యోగులకు రూ.కోట్ల షేర్లు ప్రకటించిన ప్రూడెంట్ అధినేతపై సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తాయి.

## టాటా గ్రూప్ కంపెనీకి చైర్మన్‌గా గణపతి సుబ్రమణ్యం



టాటా గ్రూప్‌నకు చెందిన టెలీ కమ్యూనికేషన్స్ సంస్థ టాటా కమ్యూనికేషన్స్ లిమిటెడ్ చైర్మన్‌గా ఎన్ గణపతి సుబ్రమణ్యం నియమితులయ్యారు. కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ చైర్మన్‌గా గణపతి సుబ్రమణ్యం నియామకానికి టాటా కమ్యూనికేషన్స్ బోర్డు తాజాగా ఆమోదం తెలిపింది. ఎన్‌జీఎస్‌గా ప్రసిద్ధి చెందిన గణపతి సుబ్రమణ్యం 2021 డిసెంబర్‌లో టాటా కమ్యూనికేషన్స్ లిమిటెడ్ బోర్డులో నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా చేరారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (టీసీఎస్) తోపాటు భారత ఐటీ పరిశ్రమలో ఆయన 40 ఏళ్లుగా ఉన్నారు. 2024 మేలో టీసీఎస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పదవి నుంచి వైదొలిగారు. నామినేషన్ అండ్ రెమ్యూనరేషన్ కమిటీ సిఫార్సు మేరకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు 2025 మార్చి 14 నుంచి నాన్ ఎగ్జిక్యూటివ్, నాన్ ఇండిపెండెంట్ డైరెక్టర్ ఎన్ గణపతి సుబ్రమణ్యాన్ని కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ చైర్మన్‌గా నియమించిందని టాటా కమ్యూనికేషన్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా బ్యాంకింగ్, టెలికాం, పబ్లిక్ సర్వీసెస్‌లో టీసీఎస్ చేపట్టిన పలు మైలురాయి కార్యక్రమాల్లో ఆయన వ్యూహాత్మక పాత్ర పోషించారని కంపెనీ తెలిపింది. టెక్నాలజీ, ఆపరేషన్స్, ప్రొడక్ట్ డెవలప్మెంట్, బిజినెస్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఛేంజ్ మేనేజ్మెంట్‌పై ఆయనకు లోతైన పరిజ్ఞానం ఉందని పేర్కొంది. ప్రస్తుతం గణపతి సుబ్రమణ్యం టాటా ఎలెక్సీ లిమిటెడ్, తేజస్ నెట్ వర్క్స్ లిమిటెడ్ లో బోర్డు చైర్మన్, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, టాటా కమ్యూనికేషన్స్ లిమిటెడ్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు. అలాగే భారత్ 6జీ అలయన్స్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా, శ్రీ చిత్ర తిరునాళ్ ఇన్ స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీలో ఇన్‌స్టిట్యూట్ బాడీ సభ్యుడిగా, ముంబైలోని దివ్యాంగ పిల్లల పునరావాస సొసైటీ కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

## ఫ్రీగా ఓయో రూమ్స్‌లో బస



భారతదేశ ప్రముఖ ఆతిథ్య బ్రాండ్లలో ఒకటైన ఓయో రూమ్స్ వినియోగదారులకు హోలీ సందర్భంగా ఉచిత ఆఫర్‌ను ప్రకటించింది. ఇండియా క్రికెట్ టీమ్ ఇటీవల ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ సాధించడం, తర్వాత హోలీ పండుగ నేపథ్యంలో మార్చి 13 నుంచి 18 వరకు ఓయో దేశవ్యాప్తంగా 1,000 ప్రీమియం కంపెనీ సర్వీస్ హోటళ్లలో రోజూ 2,000 ఉచిత స్టేలను అందిస్తున్నట్లు పేర్కొంది. ఈమేరకు సంస్థ వ్యవస్థాపకులు రితేష్ అగర్వాల్ ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించారు. వినియోగదారులు ఈ పరిమిత ఓయో ప్రీమియం ఆతిథ్యాన్ని ఎటువంటి ఖర్చు లేకుండా ఆస్వాధించవచ్చని రితేష్ తెలిపారు. ఓయో యాప్ లేదా వెబ్సైట్ ద్వారా బుకింగ్ చేసేటప్పుడు కూపన్ కోడ్ 'CHAMPIONS' అని ఎంటర్ చేయాలని పేర్కొన్నారు. దాంతో కస్టమర్లు తమ కాంప్లిమెంటరీ స్టేను రెడీమ్ చేసుకోవచ్చని చెప్పారు. ఈ ఆఫర్ ఫస్ట్ కమ్, ఫస్ట్ సర్వ్(ముందుగా బుక్ చేసుకున్న వారికే వర్తించేలా) ప్రాతిపదికన పని చేస్తుందని స్పష్టం చేశారు. భారత ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ విజయాన్ని అందరూ అస్వాదిస్తున్నారని రితేశ్ తెలిపారు. ఈ నేపథ్యంలో హోలీ తోడవడం వినియోగదారులకు మరింత ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. ఈ తరుణంలో కంపెనీ కస్టమర్లకు ఉచిత ఆఫర్ ప్రకటించిందని చెప్పారు. ఈ వారాంతంలో మధురమైన జ్ఞాపకాలను సొంతం చేసేందుకు కంపెనీ తోడ్పడిందని తెలిపారు. ప్రయాణాలు చేయడం, ప్రియమైనవారిని కలవడం కంటే సంతోషకరమైన క్షణాలు ఏముంటాయన్నారు. అందుకోసం ఓయో రూమ్స్ 'టౌన్ హౌస్, కలెక్షన్ ఓ'తో సహా 1000కి పైగా ఓయో కంపెనీ సర్వీస్ హోటళ్లలో మార్చి 1318 వరకు ప్రతిరోజూ ఉచిత బసలను అందిస్తున్నట్లు చెప్పారు.

## అమెరికాలోనూ నో ట్యాక్స్..! ట్రంప్ భారీ పన్ను ప్రణాళిక



భారత్‌లో మాదిరిగానే అమెరికాలోనూ ఆదాయపు పన్నుకు సంబంధించి భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది. లక్షలాది మంది అమెరికన్లకు పన్ను మినహాయింపునిచ్చే భారీ పన్ను ప్రణాళికను అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ వెల్లడించారు. సంవత్సరానికి 150,000 డాలర్ల కంటే తక్కువ సంపాదించేవారికి ఫెడరల్ పన్నులను తొలగించే యోచనలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉన్నారని సీబీఎస్ ఇంటర్వ్యూలో లుట్నిక్ చెప్పారు. 'ట్రంప్ లక్ష్యం ఏమిటో నాకు తెలుసు. సంవత్సరానికి 150,000 డాలర్ల కంటే తక్కువ సంపాదించే ఎవరికైనా పన్ను ఉండకూడదు. అదే ఆయన (ట్రంప్) లక్ష్యం. దానికోసమే నేను పనిచేస్తున్నా' అని లుట్నిక్ తెలిపారు. లుట్నిక్ అక్కడితో ఆగలేదు. అమెరికన్ల పన్ను భారాలను మరింత తగ్గించే లక్ష్యంతో విస్తృత ఆలోచనలను తెరపైకి తెచ్చారు. పన్ను సంస్కరణలపై దూకుడు వైఖరి ఉంటుందని ఆయన సంకేతాలిచ్చారు. ట్రంప్ ప్రతిపాదన అమల్లోకి వస్తే ఏడాదికి 1,50,000 డాలర్లు అంటే సుమారు రూ.1.3 కోట్లు కంటే తక్కువ సంపాదించే వారికి పన్ను చెల్లించకుండా మినహాయింపు లభిస్తుంది. ఈ లక్ష్యాన్ని నిజం చేయడమే తన ప్రస్తుత లక్ష్యమని లుట్నిక్ స్పష్టం చేశారు. కెనడా, మెక్సికోలతో కొనసాగుతున్న సుంకాల యుద్ధాలతో సహా ట్రంప్ ఆర్థిక వ్యూహాన్ని సమర్థిస్తూ.. విధానాలు మాంద్యాన్ని ప్రేరేపించే ప్రమాదం ఉన్నప్పటికీ అవి అవసరమని లుట్నిక్ పేర్కొన్నారు. ఇక పన్ను కోతలతో ముడిపడిన పెరుగుతున్న లోటుల గురించి ఆందోళనలపై స్పందిస్తూ ప్రభుత్వ ఖర్చులు అమెరికన్లకు భారం కాకూడదన్నారు లుట్నిక్. విదేశీ సంస్థలు, విదేశీ పన్ను ఎగవేతదారులను ప్రస్తావిస్తూ 'ఇతర వ్యక్తులు' ఈ వ్యయాన్ని భరించాలి. అంతర్జాతీయ పన్ను లొసుగులను సరిదిద్దడం వల్ల దేశీయ పన్ను ఉపశమనం లభిస్తుందని ఆయన వివరించారు. మరోవైపు ట్రంప్ వివాదాస్పద 5 మిలియన్ డాలర్ల అమెరికా వీసా ప్రతిపాదనకు కూడా లుట్నిక్ మద్దతు తెలిపారు. ఇది అదనపు ఆదాయాన్ని సృష్టిస్తుందని పేర్కొన్నారు.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## నాటి వారి పాలన కంటే మీ పాలనే అధ్వానంగా ఉంది



**ముంబై:** మహారాష్ట్రలో ప్రస్తుత పాలన అధ్వానంగా ఉందని శివసేన(యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ విమర్శించారు. ఔరంగజేబు పరిపాలన ఆనాటి పాలన కంటే నేటి రాష్ట్రంలోని బీజేపీ పాలనే అధ్వానమన్నారు. కేవలం బీజేపీ వల్లే ఈ రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు సంభవిస్తున్నాయని సంజయ్ రౌత్ విమర్శించారు. ఒక్క రైతులే కాదని, నిరుద్యోగులు, మహిళలు ఆత్మహత్యలకు పాల్పుడుతన్నారన్నారు. ఔరంగజేబు ఇక్కడ 400 ఏళ్ల చరిత్ర ఉంది. మనం దాదాపు ఆయన్ని మరిచిపోయాం. మరి ఇప్పుడు రైతుల ఆత్మహత్యలకు అప్పటి ఔరంగజేబు కారణమా?, మీ వల్లే(బీజేపీ) రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. మహాయుతి కూటమి వల్లే ఈ దారుణాలు జరుగుతున్నాయి. ఆనాటి మొఘల్ చక్రవర్తి దౌర్జన్యాలు చేస్తే, మరి నేటి ప్రభుత్వం ఏమి చేస్తుందని ప్రశ్నించారు.

## జమ్ముకశ్మీర్‌లో భూకంపం
### 5.2 తీవ్రత నమోదు



**కార్గిల్:** కేంద్రపాలిత ప్రాంతమైన లడఖ్‌తో పాటు జమ్ముకశ్మీర్‌లో భూమి కంపించింది. హోలీ రోజున తెల్లవారుజామున 2.50 గంటలకు లడఖ్‌లోని కార్గిల్‌లో 5.2 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ ప్రకంపనలు జమ్ముకశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాలలోనూ కనిపించాయి. భూకంప కేంద్రం 15 కిలోమీటర్ల లోతులో ఉందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. కార్గిల్‌లో భూకంపం సంభవించిన మూడు గంటలకే ఈశాన్య భారతదేశంలో కూడా ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. అరుణాచల్ ప్రదేశ్‌లోని పశ్చిమ కామెంగ్ ప్రాంతంలో 4.0 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఉదయం 6 గంటలకు ఇక్కడ భూకంపం సంభవించింది. మార్చి 13న మధ్యాహ్నం 2 గంటలకు టిబెట్‌లో 4.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. కాగా లేహ్,లడఖైందూ భూకంప జోన్IV పరిధిలోకి వస్తాయి. అంటే భూకంపాల పరంగా ప్రమాదం అధికంగా ఉన్న ప్రాంతాలివి. జమ్ముకశ్మీర్‌లో భూకంపం సంభవించిన సమయంలో తమ అనుభవాలను పలువురు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు.



## రైల్వే గేటును ఢీకొని పట్టాలపైకి ట్రక్కు.. ఇంతలో వేగంగా రైలు రావడంతో..

**జల్గావ్:** మహారాష్ట్రలోని జల్గావ్‌లో రైలు ప్రమాదం చోటుచేసుకుంది. జల్గావ్ జిల్లాలోని బోద్వాల్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. గోధుమల బస్తాలతో నిండిన ఒక ట్రక్కు కాపలా లేని రైల్వే గేటును ఢీకొని, పట్టాలపైకి చేరుకుంది. ఇంతలో అదే ట్రక్‌పైకి అంబా ఎక్స్‌ప్రెస్ వేగంగా వచ్చింది. అది ట్రక్కును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో టక్కు తునాతునకలయ్యింది. ఆ ట్రక్కులోని కొంతభాగం రైలు ఇంజిన్‌లో ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు. అయితే రైల్వేకు భారీ నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో మధ్య రైల్వేకు చెందిన ముంబైకోల్‌కతా మార్గంలోని ఓవర్‌హెడ్ ఎలక్ట్రిక్ వైరు తీవ్రంగా దెబ్బతింది. దీంతో ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం వాటిల్లింది. ప్రస్తుతం ఈ మార్గంలో మరమ్మతు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ట్రక్కు డ్రైవర్ రైల్వే నిబంధనలను పట్టించుకోకుండా రైల్వే క్రాసింగ్‌ను దాటే ప్రయత్నం చేశాడు. ఫలితంగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రైల్వేశాఖ ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించింది. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోనుంది.

## పెళ్లి చేసుకోవాలని యువతి ఒత్తిడి..!



**కర్ణాటక:** జిల్లాలో హనీ ట్రాప్ ఆరోపణలు గుప్పుమన్నాయి. గుబ్బి పట్టణ పంచాయతీ మాజీ అధ్యక్షుడు జీఎన్ అన్నప్పస్వామి ఈ మేరకు ఓ యువతిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారం జిల్లా అంతటా చర్చనీయాంశమైంది. ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం అన్నప్పస్వామికి ఇటీవల ఫేస్‌బుక్‌లో నిషా అనే యువతి పరిచయమైంది. దీంతో ఇద్దరి మధ్య స్నేహం పెరిగి తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. అమ్మాయి ఆహ్వానం మేరకు హాసన్, తిపటూరు, దొడ్డబళ్ళాపుర, నెలమంగల ఇలా అనేకచోట్ల కలిశారు. ఆపై యువతి నిన్ను ప్రేమిస్తున్నానని, పెళ్ళి చేసుకోవాలని ఒత్తిడి చేయసాగింది. దీనికి తిరస్కరించడంతో నిషా, ఆమె స్నేహితులతో కలిసి బెదిరింపులకు పాల్పడింది. మనం కలిసి ఉన్న నగ్నచిత్రాలను వైరల్ చేస్తానని హెచ్చరించింది. తనను హనీ ట్రాప్ చేసి రూ. 20 లక్షల డబ్బు ఇవ్వాలని ఒత్తిడి చేస్తోందని అన్నప్పస్వామి చెబుతున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు యువతిని అదుపులోకి తీసుకున్నారు.

## పశ్చిమ బెంగాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం




**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఏడుగురు మృతి చెందారు. వేగంగా వస్తున్న కారు మూడు ఆటోలను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మహిళలు, చిన్నారి సహా ఏడుగురు మృతిచెందారు. ఎనిమిది మంది గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈద్ పండుగ కోసం షాపింగ్ చేసి ఇంటికి తిరిగి వస్తుండగా చాప్రా ప్రాంతంలోని లక్ష్మీగచ్ఛ వద్ద ఈ సంఘటన జరిగింది. బాధితులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ వాహనాన్ని వదిలి పారిపోగా, అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. మరో ఘటనలో వడోదర రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. శుక్రవారం తెల్లవారుజామున గుజరాత్‌లోని వడోదర నగరంలో 20 ఏళ్ల లా విద్యార్థి నడుపుతున్న కారు వారి ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతో ఒక మహిళ మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానికుల కథనం ప్రకారం నిందితుడు మద్యం మత్తులో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

## మహాత్మా గాంధీ మునిమనవడు వివాదాస్పద వ్యాఖ్యలు



**తిరువనంతపురం :** స్వాతంత్ర్య సమరయోధుడు, జాతిపిత మహాత్మాగాంధీ మునిమనవడు తుషార్ గాంధీని అరెస్ట్ చేయాలని అటు ఆర్ఎస్ఎస్, ఇటు బీజేపీ డిమాండ్ చేస్తుంది. అరెస్ట్‌తో సరిపెట్టడం కాదు. తప్పని సరిగా తమకు క్షమాపణలు చెప్పాల్సిందేనని భీష్మిస్తున్నాయి. తుషార్ గాంధీ ఇటీవల కేరళ రాజధాని తిరువనంతపురంలోని నెయ్యంట్టికరలో గాంధీ సిద్ధాంతవాది పి.గోపీనాథన్ నాయకర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై విమర్శలు గుప్పించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ రెండూ సమాజానికి ప్రమాదకరం, శత్రులని అభివర్ణించారు. ఆర్ఎస్ఎస్ నిలువెల్లా విషం నింపుకుందని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. స్థానిక బీజేపీ, ఆర్ఎస్ఎస్ వాదులు తుషార్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన్ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన కారును అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే,ఇదే అంశంపై తుషార్ గాంధీ ప్రస్తావించారు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడుతున్నట్లు చెప్పారు. చేసిన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవడం, క్షమాపణలు చెప్పబోమని అన్నారు. ఈ సంఘటన నా సంకల్పాన్ని మరింత బలపరచిందన్నారు.

## రెచ్చిపోయిన గ్రామస్తులు.. పోలీసులపై దాడి.. ఏఎస్ఐ మృతి



**పాట్నా:** ఓ ఊరి గ్రామస్తులు దారుణానికి ఒడిగట్టారు. ఊర్లో పెళ్లి చేసుకుంటున్న క్రిమినల్‌ను అరెస్ట్ చేసేందుకు వచ్చిన పోలీసులపై దాడుల చేశారు. గ్రామస్తులు చేసిన దాడుల్లో ఏఎస్ఐ దుర్మరణం పాలయ్యారు. బీహార్ రాష్ట్రం, అరారియా జిల్లా ఫుల్కహా అనే గ్రామంలో అన్మోల్ యాదవ్ ఓ పేరు మోసిన క్రిమినల్. పలు నేరాలకు పాల్పడి.. పోలీసులు కళ్లు గప్పి తప్పించుకుని తిరుగుతున్నాడు. అయితే ఈ క్రమంలో బుధవారం అన్మోల్ యాదవ్ తన స్వగ్రామంలో పెళ్లి చేసుకుంటున్నాడనే సమాచారం పోలీసులకు అందింది. వెంటనే ఫుల్కహా గ్రామంలో పోలీసులు మోహరించారు. పెళ్లి చేసుకుంటున్న క్రిమినల్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో గ్రామస్తులు రెచ్చిపోయారు. పోలీసులపై దాడులకు తెగబడ్డారు. దాడుల్లో ఏఎస్ఐ రాజీవ్ రంజన్ మాల్ దెబ్బలకు తాళలేక స్పృహ కోల్పోయాడు. అప్రమత్తమైన పోలీసులు రాజీవ్ రంజన్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల్లో ఏఎస్ఐ అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారని ఎస్పీ అంజన్ కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామంలో ఆరుగురు ఆనుమోల్ యాదవ్ మద్దతుదారుల్ని అరెస్ట్ చేశారు. అనుమోల్ యాదవ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ ముమ్మరం చేశారు.

## ప్రేయసి కోసం ముందు జాగ్రత్తలు తీసుకున్న

# 60 ఏళ్ల హీరో.. అప్పుడే..!





తోడు కోరుకోవడం తప్పేం కాదు.. అయితే బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ 60 ఏళ్ల వయసులో తోడు కావాలని కోరుకోవడంతో అందరూ నోరెళ్లబెడుతున్నారు. పైగా ఇతడు రెండుసార్లు పెళ్లి చేసుకోగా.. ఇద్దరికీ విడాకులిచ్చేశాడు. విడాకులిచ్చాడన్నమాటే కానీ మాజీ భార్యల్ని సొంత మనుషుల్లా చూసుకుంటాడు. వారితో ఇప్పటికీ స్నేహితుడిగానే మెదులుతాడు.

**60 ఏళ్ల వయసులో డేటింగ్**

ఇకపోతే మార్చి 14న ఆమిర్ బర్త్‌డే. ఈ రోజు అతడు 60వ పడిలోకి అడుగుపెట్టాడు. రెండు రోజులనుంచి ప్రీబర్త్‌డే సెలబ్రేషన్స్ జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో తాను ప్రేమలో ఉన్న విషయాన్ని బయటపెట్టి అందరికీ షాకిచ్చాడు. గౌరి స్ప్రాట్ (Gauri Spratt)ను ప్రేమిస్తున్నట్లు వెల్లడించాడు. ఆమె 25 ఏళ్లుగా తెలుసని, కాకపోతే ఏడాది నుంచే డేటింగ్‌లో ఉన్నామని తెలిపాడు. బెంగళూరులో నివసిస్తున్న గౌరీకి ఆరేళ్ల కుమారుడు ఉన్నాడు.

**ప్రేయసి కోసం ముందుజాగ్రత్త**

ఆమిర్ ప్రేయసి అనగానే అందరూ ఆమె ఎలా ఉంది? ఏం చేస్తుంది? ఎక్కడికి వెళ్తుంది? అని తనను ఫాలో అవడం ఖాయం. అందుకనే ప్రేయసికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదని ఆమె కోసం ప్రైవేట్ సెక్యూరిటీని పెట్టాడు. అలాగే మీడియా ఫాలోయింగ్ ఎలా ఉంటుందో కూడా చెప్పాడట! దీని గురించి ఆమిర్ మాట్లాడుతూ.. ఒక స్టార్ కనిపిస్తే మీడియా ఎలా వారి వెంటపడతారు? ఎలా ఫాలో చేస్తారు? వంటి విషయాలన్నీ తనకు అర్థమయ్యేలా చెప్పాను.

**స్పెషల్ డిన్నర్ డేట్**

తనకివన్నీ అలవాటు కావడానికి సమయం పడుతుంది. మీరు కాస్త సహకరిస్తారని కోరుకుంటున్నాను. తనకోసం ఇప్పటికే సెక్యూరిటీని కూడా నియమించాను అని చెప్పుకొచ్చాడు. అన్నట్లు ఈరోజు ఆమిర్ బర్త్‌డే కావడంతో డిన్నర్ డేట్ ఏర్పాటు చేసిందట. క్యాండిల్స్, ఫ్లవర్స్ మధ్య వారిద్దరూ విందును ఆస్వాదించనున్నారట!

**పర్సనల్ లైఫ్**

బాలీవుడ్‌లో సూపర్‌స్టార్‌గా రాణిస్తున్న ఆమిర్ ఖాన్.. 1986లో రీనా దత్తాను పెళ్లి చేసుకున్నాడు. వీరికి కుమారుడు జునైద్, కూతురు ఐరా ఖాన్ సంతానం. తర్వాత పలు కారణాల వల్ల ఆమిర్ 2002లో రీనాకు విడాకులిచ్చేశాడు. 2005లో డైరెక్టర్ కిరణ్‌రావును పెళ్లి చేసుకున్నాడు. వీరికి సరోగసి ద్వారా ఆజాద్ రావు జన్మించాడు. 2021లో ఈ జంట కూడా విడిపోయారు.

## ఈ సినిమా నా జీవితాన్ని

# మార్చేసింది

### డ్రాగన్ బ్యూటీ కయాదు లోహర్




హీరోయిన్ కయాదు లోహర్ ఇటీవలే డ్రాగన్ మూవీతో ప్రేక్షకులను అలరించారు. 21 ఏళ్ల వయసులోనే కన్నడ సినిమా ముగిల్‌పేటతో ఇండస్ట్రీలో అడుగుపెట్టారు. ఆ తరువాత మలయాళంలో పథోన్‌పత్తం నూత్తాండు అనే చిత్రంలో అక్కడ కూడా ఎంట్రీ ఇచ్చారు. తెలుగులో 2022లోనే శ్రీ విష్ణు హీరోగా నటించిన అల్లూరి చిత్రంతో టాలీవుడ్ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. అంతే కాకుండా మరాఠీ భాషలోనూ ప్రేమ్ యు అనే చిత్రంలో కనిపించింది. దక్షిణాది అన్ని భాషల్లో అడుగుపెట్టిన డ్రాగన్ మూవీతో సూపర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుందిం. ఈ సందర్భంగా ఈ సినిమాను గురించి సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసింది.

డ్రాగన్ సినిమా తన జీవితాన్నే మార్చేసిందని చెబుతోంది ఈ అస్సాం బ్యూటీ. ఈ సందర్భంగా డైరెక్టర్, హీరోతో పని చేసిన అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా షేర్ చేసింది. ప్రదీప్ రంగనాథన్ లాంటి కో స్టార్‌తో పని చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపింది. ఈ మూవీతో నాకు నిజమైన స్నేహితుడు దొరికాడని సంతోషం వ్యక్తం చేసింది. అయితే మొదట ఈ సినిమాలో ఛాన్స్ రాదేమోనని బాధపడ్డానని కయాదు లోహర్ వెల్లడించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఇన్‌స్టాలో సుదీర్ఘ పోస్ట్ చేసింది. కయాదు లోహర్ ఇన్‌స్టాలో రాస్తూ..'మొదట జూమ్ కాల్‌లో డైరెక్టర్ అశ్వత్ మరిముత్తు కీర్తి క్యారెక్టర్‌కు సంబంధించిన కథ చెప్పారు. అది విని చాలా ఉత్సాహంగా ఉన్నా. కానీ ఆ తర్వాత అతని నుంచి నాకు రిప్లై రాలేదు. దీంతో నేను ఆ ప్రాజెక్ట్‌ను కోల్పోయానేమో అని కొంచెం బాధపడ్డా. కానీ ఒక నెల తరువాత అశ్వత్ మళ్లీ నాతో టచ్‌లోకి వచ్చారు. రెండోసారి పల్లవి పాత్ర కోసం నాకు నేరేషన్ ఇచ్చారు. నేరేట్ చేయడం పూర్తి చేసిన తర్వాత మీటింగ్ ముగించి ఆయన వెళ్లిపోవడంతో కాస్త కంగారు పడ్డా. కానీ 5 నిమిషాల్లోనే తిరిగి వచ్చి పల్లవిగా నిన్ను ఎంపిక చేసినట్లు ఆయన చెప్పిన మాటలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయని' తెలిపింది.

ఆ తర్వాత తాను పల్లవి పాత్రలో అద్భుతంగా చేసి చూపిస్తానని ఆయనకు ప్రామిస్ చేశా.అశ్వత్ మరిముత్తు సినిమాలో స్త్రీ పాత్రలకు ఎప్పుడూ ప్రాధాన్యత ఉంటుంది. ఈ కథను రెండుసార్లు విని.. పల్లవి పాత్రను అర్థం చేసుకున్న తర్వాత ఈ చిత్రంలో భాగమయ్యే అవకాశాన్ని కోల్పోకూడదని నిర్ణయించుకున్నా. పల్లవి పాత్ర నాకు ఇచ్చినందుకు అశ్వత్‌కు ధన్యవాదాలు. నాకు అద్భుతమైన పాత్రతో అరంగేట్రం ఇచ్చినందుకు. మీకు నటుల పట్ల మీకు ఉన్న ప్రేమ, వారికి ఉత్తమమైన పాత్రలు అందించడం, వేరే దేని గురించి ఆలోచించకుండా పూర్తిగా సినిమాపై ప్రేమ పని చేస్తారు. ఈ విషయంలో మీకు ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటానని' పోస్ట్ చేసింది. ప్రదీప్ రంగనాథన్ గురించి రాస్తూ..' ప్రదీప్ లాంటి కో స్టార్ దొరకడం చాలా అరుదు. ఈ సినిమాతో నాకు నిజమైన స్నేహితుడు లభించాడు. అతని అనుభవం నుంచి నేర్చుకున్న పాఠాలు నా మనసులో ఎప్పటికీ గుర్తుండిపోతాయి. మేమిద్దరం సెట్‌లో మాట్లాడుకోవడం.. కథ గురించి చర్చించుకోవడం.. మా ఇద్దరి మనస్సులో ఎప్పటికీ నిలిచే ఉంటుంది. ప్రదీప్ సార్ మీరు సూపర్ టాలెంటెడ్.. అద్భుతమైన నటుడు మీరు' అంటూ హీరోపై ప్రశంసలు కురిపించింది.

# సెంచరీ కొట్టిన పుష్పరాజ్.. మేకర్స్ స్పెషల్ వీడియో



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 గతేడాది డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకొచ్చింది. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఏకంగా రూ.1800 కోట్లకు పైగా వసూళ్లతో ఇండియన్ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డ్ సృష్టించింది. అమిర్ ఖాన్ దంగల్ తర్వాత (రూ. 2,070 కోట్లు) ఇండియాలోనే రెండో స్థానంలో నిలిచింది. అంతేకాకుండా ఆర్ఆర్ఆర్, కేజీఎఫ్, బాహుబలి లాంటి సినిమాల రికార్డులను తుడిచిపెట్టేసింది. అయితే ఈ సినిమా విడుదలై నేటికి 100 రోజులు పూర్తి చేసుకుంది. దీంతో మేకర్స్ స్పెషల్ వీడియోను రిలీజ్ చేశారు. ఇండియన్ సినిమా ఇండస్ట్రీ పుష్ప 2 ది రూల్.. 100 డేస్ అంటూ క్యాప్షన్ ఇచ్చారు. బాక్సాఫీస్ వద్ద రికార్డ్ బద్దలు కొడుతూ.. భారతీయ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది అంటూ ట్విటర్‌లో పోస్ట్ చేశారు. కాగా.. ప్రస్తుతం ఈ మూవీ నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. కాగా.. పుష్ప 2 విషయానికి వస్తే 2021లో వచ్చిన పుష్ప మూవీకి సీక్వెల్‌గా తెరకెక్కించారు. ఈ చిత్రంలో అల్లు అర్జున్, రష్మిక మందన్నా జంటగా నటించారు. సుకుమార్ దర్శకత్వం వహించగా.. దేవి శ్రీప్రసాద్ సంగీతం అందించారు. ఫహద్ ఫాజిల్, రావు రమేశ్, జగపతి బాబు, సునీల్, అనసూయ, జగదీశ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ భారీ ఎత్తున నిర్మించారు.

## క్రీడా వార్తలు | SPORTS NEWS



## ఐపీఎల్‌కు ముందు ఫ్యామిలీతో

# ఎంజాయ్ చేస్తున్న రోహిత్

అతి పెద్ద క్రికెట్ పండుగ ఐపీఎల్ మరో 8 రోజుల్లో ప్రారంభం కానుంది. క్యాష్ రిచ్ లీగ్ 18వ ఎడిషన్ కోసం యావత్ క్రికెట్ ప్రపంచ ఆతృతగా ఎదురుచూస్తుంది. లీగ్‌లో పాల్గొనే ఫ్రాంచైజీలన్నీ సన్నాహకాల్లో బిజీగా ఉన్నాయి. ఆటగాళ్లు ఒక్కొక్కరుగా జట్లతో చేరుతున్నారు. ఫ్రాంచైజీల ముఖ్యులు వ్యూహరచనల్లో నిమగ్నమై ఉన్నారు. రెండు నెలలకు పైగా సాగే ఈ మెగా ఈవెంట్‌లో మొత్తం 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. మార్చి 22న డిఫెండింగ్ ఛాంపియన్ కేకేఆర్, ఆర్సీబీ మధ్య మ్యాచ్‌తో ఐపీఎల్ 2025 ప్రారంభమవుతుంది. మే 25న జరిగే ఫైనల్లో ముగుస్తుంది ఛాంపియన్స్ ట్రోఫీ అనంతరం భారత ఆటగాళ్లు కూడా ఒక్కొక్కరుగా తమతమ శిబిరాలకు చేరుకుంటున్నారు. అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ ఆల్రెడీ డ్యూటీకి ఎక్కేశారు. యాడ్స్‌తో బిజీగా ఉన్న విరాట్ కోహ్లి మరికొద్ది రోజుల్లో ఆర్సీబీతో జతకడతాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ సుదీర్ఘంగా సాగే ఐపీఎల్‌కు ముందు సేద తీరుతున్నాడు. రోహిత్ సరదాగా కుటుంబంతో కలిసి దిగిన ఫోటో ఒకటి సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ ఫోటోలో రోహిత్.. తన నెలల చిన్నారి, కూతురు సమైరా మరియు భార్య రితికాతో కలిసి బోట్‌లో ప్రయాణిస్తూ కనిపించాడు. ఐపీఎల్ 2025లో రోహిత్ శర్మ ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. రోహిత్ కెప్టెన్సీలో ముంబై ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిచింది. ఐపీఎల్ హిస్టరీలో సీఎస్‌కే, ముంబై ఇండియన్స్ మాత్రమే ఐదు టైటిల్స్ సాధించాయి. రోహిత్ గత సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. రోహిత్ తర్వాత హార్దిక్ పాండ్యా ముంబై పగ్గాలు చేపట్టాడు. హార్దిక్ కెప్టెన్సీలో ముంబై గత సీజన్‌లో పేలవ ప్రదర్శన చేసింది. త్వరలో ప్రారంభం కానున్న సీజన్‌లో ముంబై ప్రస్థానం మార్చి 23న మొదలవుతుంది. చెన్నై వేదికగా ఆ రోజు జరిగే మ్యాచ్‌లో ముంబై.. సమవుజ్జీ సీఎస్‌కేతో తలపడుతుంది. ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో చాలా అంచనాలు ఉన్నాయి. ఈ సీజన్ కోసం ముంబై ఇండియన్స్ పెద్దగా మార్పులేమీ చేయలేదు. మెగా వేలంలో బడా స్టార్లకు ఎర వేయలేదు. కొత్తగా విల్ జాక్స్, మిచెల్ సాంట్నర్, కార్బిన్ బాష్, ర్యాన్ రికెల్టన్ లాంటి విదేశీ ఆటగాళ్లు జట్టులో చేరారు. ట్రెంట్ బౌల్ట్‌కు గతంలో ముంబై ఇండియన్స్‌తో అనుబంధం ఉంది. మెగా వేలానికి ముందు ముంబై రోహిత్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రాను రీటైన్ చేసుకుంది.


**ఐపీఎల్ 2025 సీజన్ కోసం**

**ముంబై ఇండియన్స్..**

**హార్దిక్ పాండ్యా (కెప్టెన్), రోహిత్ శర్మ, తిలక్ వర్మ, నమన్ ధిర్, సూర్యకుమార్ యాదవ్, బెవాన్ జాకబ్స్, రాజ్ భవా, విల్ జాక్స్, విఘ్నేశ్ పుథుర్, మిచెల్ సాంట్నర్, కార్బిన్ బాష్, సత్యనారాయణ రాజు, అర్జున్ టెండూల్కర్, ర్యాన్ రికెల్టన్, రాబిన్ మింజ్, కృష్ణణ్ శ్రీజిత్, ట్రెంట్ బౌల్ట్, జస్ప్రీత్ బుమ్రా, అశ్వనీ కుమార్, రీస్ టాప్లే, కర్ణ్ శర్మ, దీపర్ చాహర్, ముజీబ్ రెహ్మాన్**

## కోహ్లీ ఈసారైనా

# టైటిల్ సాధించేనా..?



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన జట్లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఒకటి. అయితే ఈ జట్టు ఇంతవరకూ ఒక్కసారి కూడా ట్రోఫీని సాధించలేకపోవడం ఒకింత ఆశ్చర్యకరం. ఎప్పుడూ ఉత్సాహంతో ఉరకలేసే స్టార్ బ్యాట్స్మన్ విరాట్ కోహ్లి మస్కట్ గా ఉన్న ఈ జట్టుకి ఎందుకో ఇంతవరకు ఐపీఎల్ టైటిల్ అందించలేకపోయాడు. ఐపీఎల్ 2025 ప్రారంభం రోజున (మార్చి 22) కోల్‌కతాలోని చారిత్రాత్మక ఈడెన్ గార్డెన్స్‌లో గతేడాది టైటిల్ విజేత కోల్‌కతా నైట్ రైడర్స్ జరిగే మ్యాచ్ తో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) తన టైటిల్ వేటను ప్రారంభిస్తుంది. ఒకవేళ అదృష్టం కలిసి రానందువల్ల ఆర్సీబీ ఇంతవరకు టైటిల్ సాధించలేకపోయిందని భావించినట్టయితే, ఈ సీజన్ అందుకు చాల అనుకూలమైనది గా భావించాలి. ఎందుకంటే ఐపిఎల్ సీజన్ 18 స్టార్ బ్యాట్స్మన్ విరాట్ కోహ్లి ఐకానిక్ జెర్సీ నంబర్ 18 తో సరిగ్గా సరిపోతుంది. చాలా కాలంగా జెర్సీ నంబర్ 18 కి పర్యాయపదంగా ఉన్న విరాట్ కోహ్లీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కి ఈ సారైనా టైటిల్ సాధించి పెడతాడని అతని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**రజత్ పాటిదార్ కి కెప్టెన్సీ బాధ్యతలు**

ఇక జట్టు కూర్పును చూస్తే, దేశవాళీ క్రికెట్ లో నిలకడగా రాణిస్తున్న 31 ఏళ్ల రజత్ పాటిదార్ కి ఆర్సీబీ ఈసారి కెప్టెన్సీ బాధ్యతలు అప్పజెప్పింది. ఐపీఎల్‌లో తొలిసారి కెప్టెన్సీ చేపట్టనున్నప్పటికీ, పాటిదార్ 202425 సయ్యద్ ముష్తాక్ అలీ టోర్నమెంట్ లో మధ్యప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇందులో మధ్యప్రదేశ్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. మెగా వేలం ద్వారా గణనీయమైన మార్పులు చేసిన తర్వాత ఆర్సీబీ కొత్త దృక్పథంతో, కొత్త ఉత్సాహంతో ఐపీఎల్2025లోకి అడుగుపెడుతుంది. గత సీజన్‌లో ఆర్సీబీ వరుసగా ఆరు మ్యాచ్‌లను గెలిచి టాప్ నాలుగు స్థానాల్లో నిలిచి ప్లేఆఫ్‌లకు అర్హత సాధించింది. చివరికి రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఎలిమినేటర్‌లో పరాజయం చవిచూసింది. ఆర్సీబీ మరోసారి సామర్థ్యంతో నిండిన జట్టును నిర్మించింది. శక్తివంతమైన బ్యాటింగ్ లైనప్, బలీయమైన బౌలింగ్, నాయకత్వ అనుభవం, కలగలిసి ఈ సీజన్ లోనైనా తొలి టైటిల్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**ఫిల్ సాల్ట్ తో కోహ్లీ ఓపెనింగ్**

ఐసీసీ టి20 ర్యాంకింగ్స్ లో మూడో స్థానంలో ఉన్న ఇంగ్లాండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్ ను ఆర్సీబీ రూ. 11.50 కోట్లకు తీసుకుంది. గత సీజన్‌లో కేకేఆర్ టైటిల్ గెలుచుకోవడంలో సాల్ట్ కీలక పాత్ర పోషించాడు. 12 మ్యాచ్‌ల్లో 182.01 అద్భుతమైన స్ట్రైక్ రేట్‌తో 435 పరుగులు సాధించాడు. గత సీజన్‌లో ఓపెనర్‌గా అతను సాధించిన విజయాన్ని దృష్టిలో ఉంచుకుంటే ఆర్సీబీలో సాల్ట్ కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఫిల్ సాల్ట్ మరియు విరాట్ కోహ్లి ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశం ఉన్నందున, జట్టు అసాధారణమైన టాప్ ఆర్డర్‌ను సమకూర్చుకుంది. మిడిల్ ఆర్డర్‌లో రజత్ పాటిదార్, లియామ్ లివింగ్‌స్టోన్ మరియు టిమ్ డేవిడ్ ఉండటం జట్టు లైనప్‌ను మరింత బలోపేతం అవుతుంది. యావ బ్యాట్స్మన్ జితేష్ శర్మ కీపింగ్ విధులను కూడా నిర్వహిస్తాడు. సీనియర్ పేస్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ ఆర్సీబీ రావడంతో వారి బౌలింగ్ లైనప్‌కు గణనీయమైన బలాన్నిచ్చింది. ముంబై ఇండియన్స్‌తో బిడ్డింగ్ యుద్ధం తర్వాత ఆస్ట్రేలియన్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్ సేవలను పొందేందుకు ఆర్సీబీ రూ. 12.50 కోట్లు ఖర్చు చేసింది. ఇంకా లుంగి ఎంగిడి, నువాన్ తుషార వంటి ఫాస్ట్ బౌలర్లను చేర్చుకోవడం వలన ఆర్సీబీ బౌలింగ్ బలీయంగా ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com